ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 6 డిసెంబరు 2024

రెవెన్యూ సదస్సులకు సహకరించాలి

● నేటి నుంచి జిల్లాలో సదస్సులు : కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు రాజకీయ పార్టీలు సహకరించి విజయవంతమయ్యేలా చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు జిల్లాలో అన్ని గ్రామాల్లో నిర్వహించబోయే రెవెన్యూ సదస్సులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహించబోయే రెవెన్యూ సదస్సులపై అభిప్రాయాలు, సూచనలు ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు. కొన్నిచోట్ల భూఆక్రమణలు, బలవంతంగా భూములు లాక్కోవడం వంటి సమస్యలు ఉన్నాయని, వీటిని కూడా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వివిధ పార్టీల ప్రతినిధులు కోరారు. రాజకీయ పార్టీల తరపున వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజలకు సహకరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 501 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఈ సదస్సుల గురించి ప్రజాప్రతినిధులు ప్రజలందరికీ తెలియజేసి విజయవంతం చేయాలని కోరారు. ఎటువంటి సమస్య ఉన్నా రెవె న్యూ సదస్సుకు ప్రజలు రావచ్చునని తెలిపారు. ఇన్‌కం సర్టిఫికెట్, మ్యుటేషన్ లాంటి రెవెన్యూ సేవలను సదస్సు నిర్వహించబోయే రోజు ఆయా రె వెన్యూ సేవలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. అటువంటి రెవెన్యూ సేవలకు సదస్సు నిర్వహించబోయే రోజు కాకుండా మిగతా రోజుల్లో సర్వీ స్ చార్జ్ ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతినిధులు ప్రజలందరికీ సదస్సులపై అవగాహన కల్పించి కార్యక్రమాలను విజయవంతమయ్యే లా చేసేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షు డు చమర్తి జగన్మోహన్‌రాజు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్వో మధుసూదనరావు, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. మూలకు..!

● విద్యార్థులకు దూరమైన సైన్స్ మ్యూజియం
● ఆ స్థానంలో సచివాలయాల ఏర్పాటు
● నిరుపయోగంగా సైన్స్ పరిశోధనా పరికరాలు



6

రాయచోటిలో ఉద్రిక్తత

● గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
● పెద్దల జోక్యంతో ముగిసిన వివాదం


6



రాణా సర్కిల్‌లో గుమికూడిన ఓ వర్గానికి చెందిన ప్రజలు

ఆ తహసీల్దార్లు దేశముదుర్లు

● పైసలిస్తే చాలు.. ఏమైనా చేసేస్తారు..
● అక్రమ సంపాదన కోసం అడ్డదారులు
● కీలకపాత్ర పోషిస్తున్న వీఆర్‌వోలు
● తహసీల్దార్‌ల తీరుపై సర్వత్రా విమర్శలు



రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొంతమంది తహసీల్దార్లు పైసలిస్తే చాలు ఏ పనైనా అవలీలగా చేసేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం వారికే ఎదురే లేకుండా ఉండేది. వారిపై ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని పలువురు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలను మళ్లీ ఈ ప్రభుత్వం లోనూ చేయడానికి వెనుకడుగు వేయడం లేదన్న వాదన బలంగా వినపడుతోంది. ఈ ప్రభుత్వం వచ్చాక తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో భాగంగా కొంతమంది తహసీల్దార్లకు మండలాలు మారాయి. అయితే చార్జ్ తీసుకున్న తర్వాత ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి అని ముందుగా వీఆర్‌వోల ద్వారా సమాచారం తెలుసుకుని ఎవరైతే ఊర్లో లేరో వారి భూములు మరొకరికి కట్టబెట్టడానికి సిద్ధమైపోతున్నారు. ఈ విషయం తెలిసి కొంతమంది బాధితులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్లను నిలదీస్తే మీరు పొలం పైన లేరు కాబట్టి ఆ భూమిని వేరే వాళ్లకు ఆన్‌లైన్ చేశాము. మీకు ఏమైనా ఆధారాలు ఉంటే కోర్టుకు వెళ్లండి అని ఉచిత సలహాలు ఇస్తున్నారని బాధితులు వాపోతున్నారు. వారి అవినీతి గురించి పైఅధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా గత ప్రభుత్వంలో ఎలా చేశారే అలాగే తహసీల్దార్ల అరాచకాలు మండలాల్లో ఎక్కువైపోయాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి వరకు వారిపైన జిల్లా అధికారులు ఇసుమంతైన కూడా చర్యలు తీసుకోకపోవడం వల్లే తహసీల్దార్లు అక్రమాలకు పాల్పడుతున్నారన్న వాదన బలంగా వినపడుతోంది. ఒక్క తహసీల్దార్‌కు కూడా షోకాజ్ నోటీసులు ఇవ్వడం, లేక సస్పెండ్ చేయడం లాంటి చర్యలు ఇప్పటివరకు లేవు కాబట్టి వారు రెచ్చిపోతున్నారని ఆ శాఖలోని సిబ్బంది అంటున్నారు. కాగా ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి వచ్చే ప్రజలు అధికంగా రెవెన్యూ సమస్యలపైనే కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లకు ప్రజలు ఫిర్యాదులు చేస్తుండటం గమనార్హం.



ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు (ఫైల్)

జిల్లాలో రెవెన్యూ లీలల్లో కొన్ని..

- వీరబల్లి మండలం వీరబల్లి గ్రామ సర్వే నెంబరు 2119/1లో విస్తీర్ణం 1.95, 2122/1లో విస్తీర్ణం 2.15, 1588లో విస్తీర్ణం 2 ఎకరాలు ఇంకా కొంత భూమిలో సగభాగం వారసత్వంగా రావాల్సి ఉండగా మొత్తం భూమిని ఒకరికి ఆన్‌లైన్ చేసి రెవెన్యూ వారు చేతులు దులిపేసుకున్నారు.
- బి.కొత్తకోట మండలం గొల్లపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 427/బీ2బీ 2.27లో పాతకాల వీరప్ప, పి.రమణప్ప అనే వారు అనుభవించుకుంటూ జీవిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన కొంతమంది వారిద్దరూ గ్రామంలో లేరు అనే సాకు చూసి వారి భూమి ఆన్‌లైన్ చేసుకుని వారిని భూమిలోకి రానివ్వకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని తెలిసింది.
- రామసముద్రం మండలం నారాగానిపల్లె, ఎర్రనేలపల్లె పొలం సర్వే నెంబరు 218/1 విస్తీర్ణం 1.75 జె.పార్వతమ్మకు 1997లో ప్రభుత్వం పట్టా ఇచ్చింది. అయితే ఆమె మరణానంతరం ఆ భూమి ఖాళీగా ఉంది. దీనిని అదునుగా చేసుకుని కొంతమంది ఆన్‌లైన్ చేసుకుని ఆక్రమించారని ఆమె కోడలు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై సంబంధిత తహసీల్దార్‌ను వెళ్లి అడగ్గా మీరు ఊర్లో లేరు కాబట్టి ఆ భూమిని వేరే వాళ్లకు ఆన్‌లైన్ చేశారు. మీరు కోర్టుకు వెళ్లండి అని ఉచిత సలహా ఇచ్చినట్లు బాధితురాలు తెలిపింది.
- ఓబులవారిపల్లె మండలం చెన్నరాజుపోడు గ్రామం అరుంధతివాడలోని గాడివారిపల్లె సర్వే నెంబర్ 884 దళితుల పొలం 12 ఎకరాలు గాడి సుబ్బారెడ్డి ఆక్రమించాడని, అందులోకి ఎవ్వరినీ రానివ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని బాధితులు పేర్కొన్నారు. అంతేగాక మంగళపల్లిలోని ఎస్టీ కాలనీలో సర్వే నెంబర్ 2604/2 మూడు ఎకరాలు మధుసూదన్‌నాయుడు ఆక్రమించారని వారు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.
- కలకడ మండలం కోన గ్రామం గంగిరెడ్డిపల్లెలో సర్వే నెంబర్ 789/2లో విస్తీర్ణం 3.28 సెంట్లు భూమి జీర్ర సాంబశివ తాత పేరు మీద ఉండేది. ఈ భూమిని సర్వేల పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి కాజేశారని తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.
- గుర్రంకొండ మండలం నడిమి కండ్రిక గ్రామంలో సర్వేనెంబర్ 562/ఏ8లో పిత్రార్జితంగా వస్తున్న ఆస్తిని చిత్తూరు నివాసుడైన రజినీనాయుడు 87 సెంట్లు ఆక్రమించుకుని మొత్తానికి కంచె వేసి బెదిరిస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- రాయచోటి మండలం పెమ్మాడపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 406/1లో 1.03 భూమిని అక్కడ పని చేస్తున్న బంట్రోతు శివమల్లయ్యనాయుడు తప్పుడు రికార్డులు సృష్టించి ఆన్‌లైన్ చేసుకున్నాడని సయ్యద్ అమీర్‌బేగ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- రాజంపేట మండలం మందరం గ్రామంలోని గొల్లపల్లి బండారు లక్ష్మమ్మకు 2014లో ఒక ఎకరా డీకేటీ పట్టా ఇచ్చారు. అయితే ఇండ్లూరి వెంకట్‌రెడ్డి, తంబెల వేణుగోపాల్‌రెడ్డి అనే వారు ఆన్‌లైన్ చేయించుకుని పొలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆమె పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.
- లక్కిరెడ్డిపల్లె మండలం బి.యర్రగుడి గ్రామంలో కొత్తవడ్డెపల్లెలో తరతరాలుగా వస్తున్న ఆస్తిని అన్నదమ్ములు పంచుకున్నారు. అయితే అందులో ఒకరు మాత్రం తిరగబడి భూమి అంతా నాదే అని దౌర్జన్యానికి దిగుతున్నాడని జగన్నాథం సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.
- రామాపురం మండలం గోపగుడిపల్లెలో గ్రామ కంఠాన్ని ఆన్‌లైన్ చేసుకుని తద్వారా బ్యాంకులో లోను కూడా తీసుకున్నాడని అదే గ్రామానికి చెందిన కొంత మంది రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలా చెప్పుకుంటూపోతే జిల్లాలో చాలామంది తహసీల్దార్‌ల తీరు చాలా దారుణంగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు తహసీల్దార్‌లు, వీఆర్‌వోలను అదుపు చేయకపోతే పెద్ద ఎత్తున సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు సమస్యలు తెలుపుకుంటున్న ప్రజలు (ఫైల్)

చింతలకుంట మాయం..



గతంలో నీటితో పుష్కలంగా ఉన్న చింతలకుంట



ప్రస్తుతం చింతలకుంటను, చదును చేసి పండించిన వరి పంట

● చెక్‌డ్యాం ధ్వంసం చేసి వరి పండించి..
● వైసీపీ నాయకుల నిర్వాకం
● ఇరువురి పేరుతో ఆన్‌లైన్ చేసేశారు


నిమ్మనపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ కొందరు అవినీతి అధికారులకు అడ్డూ అదుపు లేకుండాపోయిందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. వారు అడిగినంత డబ్బు ఇస్తే చెరువులను, కుంటలను కూడా ఆన్‌లైన్ చేసేస్తారని ఇదంతా గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా జరిగిందని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ సర్వే నెంబరు 63లో 2.99 ఎకరాల్లో చింతలకుంట ఉండేది. ఈ కుంటను ఆసరాగా చేసుకుని నీరు లేనప్పుడు పశువులు, మూగజీవాలను మేపుకుంటూ, నీరు ఉన్నపుడు మాత్రం ప్రజలు పంటలను పండించుకుని జీవనం కొనసాగించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ నాయకుల అక్రమాలకు అంతే లేకుండాపోయింది. కొందరు రెవెన్యూ అధికారులను ప్రలోభపట్టి వారి పని కానిచ్చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల అండతో కుంట స్థలాన్ని శాపరం కొండప్ప. శాపరం రామలింగయ్య పేరు మీద ఆన్‌లైన్ చేసేశారు. అయితే చింతలకుంటలో ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన చెక్‌డ్యాంను కూడా ధ్వంసం చేసి కుంటకు వేసిన కట్టను తొలగించి దర్జాగా వరి పంటను సాగు చేశారు. అయితే దీనిపై చంద్రారెడ్డి అనే రైతు చింతలకుంట ఆక్రమణపై సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కాగా సబ్‌కలెక్టర్ చింతలకుంటపై విచారణ చేపట్టి నివేదిక కూడా ఇచ్చారు. ఆ నివేదికలో సర్వే నెంబరు 63లో 2.99 ఎకరాల భూమి ప్రభుత్వ కుంటగా తేల్చారు. గత నెలలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు రైతులు ఫిర్యాదు చేయగా ఆయన కుంటను పరిశీలించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఏడాదిన్నరగా కుంట ఆక్రమణలపై అప్పటి వైసీపీ నాయకుల వద్దకు తిరిగి ఫిర్యాదు చేసినా స్పందన లేదని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న రైతు చంద్రారెడ్డి భూమిని కూడా వేరే వారి పేరుతో ఆన్‌లైన్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

కలెక్టరుకు ఫిర్యాదు చేసిన రైతు

గత నెల 14వ తేదీ నిమ్మనపల్లి వచ్చిన కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు రైతు చంద్రారెడ్డి కుంట ఆక్రమణపై ఫిర్యాదు చేశాడు. వెంగంవారిపల్లి పంచాయతీలో గల ప్రభుత్వ చింతలకుంటను ఇద్దరు వ్యక్తుల పేరు మీద అన్‌లైన్ చేశారని దీంతో వారు కుంటను చదును చేసి పంటలు పండించారని, కుంటకు సంబంధించిన రికార్డులను కూడా కలెక్టరుకు అందించారు. కలెక్టర్ పక్కనే ఉన్న తహసీల్దార్ ధనంజేయులును కుంటకు సంబంధించిన వివరాలు అడగ్గా అయన బ్రిటీష్ కాలంలోనే కుంటను ఇద్దరు వ్యక్తుల పేరుతో మార్చారని తెలిపారు. అయితే వాస్తవానికి ఏడాదిన్నర క్రితం వైసీపీ ప్రభుత్వంలో శాపరం కొండప్ప. శాపరం రామలింగయ్య పేరు మీద ఆన్‌లైనట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కలెక్టర్ కుంటపై పూర్తి వివరాలను సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించి ప్రభుత్వ కుంటగా ఉంటే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. దీనిపై ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు. కుంట ఆక్రమణపై తహసీల్దార్ ధనంజేయులును వివరణ కోరగా కుంటను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేస్తామని తెలిపారు. అది ప్రభుత్వ భూమిగా ఉంటే కలెక్టర్‌కు నివేదిక పంపి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఏ-రిజిస్టర్‌లో కుంటగా నమోదు



కొండప్ప, రామలింగయ్య పేరుతో ఆన్‌లైన్

కమిటీ సభ్యులెక్కడ..?

● పేరుకు మాత్రమే జెండర్ రీసోర్సు సెంటర్
● గురువారమైనా కనపడని కమిటీ సభ్యులు
● గ్రామాల్లో ప్రచారమెక్కడ..?
● బోసిపోయిన మదనపల్లె మోడల్ జీఆర్‌సీ



మదనపల్లె టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలకు గృహహింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు తదితర సమస్యలపై ఫిర్యాదులకు పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జెండర్ రీసోర్సు సెంటర్ (జీఆర్‌సీ) ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కేవలం 12 సెంటర్లు మంజూరు కాగా అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఒక్క మదనపల్లెలోనే గత నెల 25వ తేదీ మోడల్ జీఆర్‌సీ ఏర్పాటు చేశారు. ప్రతి గురువారం జీఆర్‌సీ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరై మహిళల సమస్యలు తెలుసుకోవాలని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారు. కానీ ప్రారంభమైన రెండు వారాలకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయానికి ఇక్కడి అధికారులు తిలోదకాలు ఇచ్చేశారు. గురువారం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన జీఆర్‌సీలో అధికారులు, కమిటీ సభ్యులు హాజరు కాలేదు. ఇక్కడికి సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే మహిళలకు ఖాళీ కుర్చీలు వెక్కిరిస్తూ కనిపించాయి.

జిల్లాలో మదనపల్లె మహిళా సమాఖ్య భవనం వద్ద తొలి జీఆర్‌సీని గత నెల 25న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా ప్రారంభించారు. నిబంధనల మేరకు ప్రతి గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీఆర్‌సీలో కమిటీ సభ్యులు, ఏపీఎం, ఎంపీడీవో, సీడీపీవో, మహిళా సమాఖ్య లీడర్లు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలి. దీనికోసం కంప్యూటర్, ఫర్నీచర్, కుర్చీలు ఏర్పాటు చేశారు. కానీ జీఆర్‌సీ ఉపయోగాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించకపోవడంతో జీఆర్‌సీ అంటేనే గ్రామీణ మహిళలకు తెలిసిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో రెండు గురువారాలు ఒక్క మహిళ కూడా జీఆర్‌సీకి వచ్చి ఫిర్యాదు చేయలేదని తెలిసింది. కేవలం నిమ్మనపల్లెకు చెందిన ఒక మహిళ పాత కేసుపై మాత్రమే సీసీ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ప్రతి గురువారం తప్పనిసరిగా జీఆర్‌సీలో హాజరు కావాలని ఏపీఎం, ఎంపీడీవో, సీడీపీవోలు ఇక్కడ సమస్యలు చెప్పుకోవడానికి ఎవరూ రాలేదని, వారి కార్యాలయాల్లో విధుల్లో ఉండిపోయారు. దీంతో జీఆర్‌సీ సెంటర్ ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. జిల్లాలో ఏకైక జీఆర్‌సీని మోడల్‌గా మదనపల్లెలో ఏర్పాటు చేస్తే, ఇక్కడ చూస్తే అధికారుల నిర్వాకంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలకు నీరు వదిలిసేసినట్లు అయింది. సంఘమిత్రలు వీవో లీడర్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి జీఆర్‌సీని వినియోగంలోకి తీసుకోవాల్సి ఉంది.

ఇతర విధులకు వెళ్లాము..

మహిళా సమాఖ్య భవనంలో జీఆర్‌సీకి మహిళలు ఫిర్యాదు చేసేందుకు రాలేదు. అందుకే ఇతర విధులు నిర్వహించేందుకు వెళ్లాము. ఒకవేళ ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేస్తే, అక్కడ ఉన్న అకౌంటెంట్ మాకు ఫోన్ చేస్తారు, కమిటీ సభ్యులందరూ వచ్చి బాధితురాళ్ల సమస్యలు నమోదు చేసుకుంటాం. వీవో లీడర్లకు జీఆర్‌సీపై అవగాహన కల్పించి, గ్రామాల్లో ప్రచారం చేస్తాం.

- సుబ్రమణ్యం, ఏపీఎం, మదనపల్లె



అధికారులు, కమిటీ సభ్యులు లేక బోసిపోయిన కుర్చీలు

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● ఉపాధ్యాయులకు భద్రతా చట్టాన్ని తేవాలి
● కొవ్వొత్తుల ర్యాలీలో ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నేతలు

రాయచోటి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్‌పై దాడిని ఖండిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం నుంచి నేతాజీ సర్కిల్ వరకు ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావం, తల్లిదండ్రుల అతి గారాభంతో పిల్లల అనైతిక మార్గాలను అవలంబిస్తున్న నేటి పరిస్థితుల్లో వారిని సక్రమమైన మార్గంలో పెట్టడానికి ఉపాధ్యాయులు ప్రయత్నించే క్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల అమర్యాదగా వ్యవహరించడం, దాడి చేయడం దారుణమన్నారు. మారిన పరిస్థితుల్లో విద్యార్థులు మత్తుకు బానిసలుగా మారడం, అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ప్రశ్నించే వారిపైన దాడికి దిగడం లాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు భయాందోళనల మధ్య వృత్తికి సరైన న్యాయం చేయలేకపోతున్నారన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన చేసే వాతావరణాన్ని కల్పించాలని, ఉపాధ్యాయ భద్రతా చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎక్కడైనా ఉపాధ్యాయులపై ఆరోపణలు వస్తే సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారి మీద చర్యలు తీసుకోవాలే తప్ప ఆరోపణ వచ్చిన వెంటనే తీవ్రమైన చర్యలు తీసుకోవడం తగదని, ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులు ఆలోచించాలని వారు కోరారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాస రాజు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్, ఎస్టీయూ నేతలు రవీంద్రనాథరెడ్డి, శివారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నేతలు ఆంజనేయులు, నరసరాజు, రెడ్డెయ్య, జగదీశ్వరయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నియోజకవర్గ కార్యదర్శి రామాంజులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విశ్వనాధనాయక్, నోబుల్ టీచర్స్ అసోషియేషన్ జిల్లా బాధ్యులు కొండూరు మురళీమోహన్ రాజు, పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు హరిబాబు, రామచంద్ర, కులశేఖర్‌రెడ్డి, గోపాల్, మున్వర్‌బాషా, సునీల్, ఇలియాస్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయ. ప్రజాసంఘాల నేతలు

నిరుపేద గూటికి
అందని సాయం..

- ప్రభుత్వ పింఛన్ లేదు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు



వాల్మీకిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూలి జీవనం సాగితే కానీ పూట గడవని నిరుపేద కుటుంబం ఆపై ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతూ ప్రభుత్వ సాయం కోసం ఆ నిరుపేద కుటుంబం ఎదురుచూస్తోంది. వివరాలిలా ఉన్నాయి. వాల్మీకిపురం పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన చలమకోటి వెంకటరమణ(58), ఈశ్వరమ్మలది నిరుపేద కుటుంబం ఆ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నిత్యం కూలి పనులకు వెళ్లి పొట్టుపోసుకునే ఆ నిరుపేద బతుకుల్లో భరించలేని కష్టం వచ్చిపడింది. ఒకటన్నర సంవత్సరం క్రితం కూలి వెంకటరమణ నిమ్మనపల్లె వద్ద దినసరి కూలి పనులకు వెళ్లి చెట్టునుంచి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకున్నా ఫలితం లేక రెండు కాళ్లు చచ్చుపడిపోయి మంచానికే పరిమితమయ్యాడు. వెంకటరమణ కదలలేని స్థితిలో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలు వర్ణనాతీతంగా మారాయి. ప్రతినెలా వెంకటరమణ మందుల నిమిత్తం రూ.10వేలకు పైగానే కావాల్సి ఉంది. డబ్బులున్న సమయంలో తప్ప కనీసం మందులు తెచ్చుకునే ఆర్థిక స్తోమత లేక చిన్నాభిన్నంగా పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత వెంకటరమణకు పింఛన్ కోసం గతేడాది డిసెంబరులో దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి దాకా ప్రభుత్వ పింఛన్ కూడా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వెంకటరమణ భార్య ఈశ్వరమ్మకు కూడా కిడ్నీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కనీసం కూలి పనులకు వెళ్లలేని ఆ దంపతులకు జీవనం కష్టసాధ్యంగా మారింది. కుమార్తెకు పెళ్లి చేసి పంపించగా ఉన్న ఒక్క కుమారుడు రెడ్డిప్రసాద్ మాత్రమే తల్లిదండ్రులకు ఆసరాగా దినసరి కూలి పనులకు వెళ్లి కుటుంబ జీవనానికి దోహదపడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటి దాకా ఎలాంటి సాయం అందించలేదని కనీసం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఆ నిరుపేద దంపతులు చేతులు జోడించి వేడుకుంటున్నారు. వైద్యం నిమిత్తం ఆర్థిక స్తోమత లేని తమకు దాతలు ఎవరైనా సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. దాతలెవరైనా సాయం చేయదలిస్తే సెల్‌ఫోన్ నెంబర్లు 7095715229, 7416744175లకు ఫోన్ పే ద్వారా సాయం అందించాలని కోరుతున్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం.. విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు కల్పించాం అని గత వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ ప్రతి ప్రసంగంలో ఊదరగొట్టేవారు. అయితే జగన్ సొంత జిల్లా కేంద్రంలో 15 సంవత్సరాలకు పైగా విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఏకైక సైన్స్ మ్యూజియంను ఆయన సీఎంగా ఉన్న సమయంలోనే నిర్వీర్యం చేశారు. దీని స్థానంలో ఏకంగా సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఇందులోని సైన్స్ పరికరాలను మూలకు చేర్చి విద్యార్థులకు విజ్ఞానం అందకుండా చేశారు.



మూలకు చేరిన సైన్స్ పరికరాలు



బెర్రానోని

విజ్ఞానం.. మూలకు..!

- వైసీపీ హయాంలో..
- విద్యార్థులకు దూరమైన సైన్స్ మ్యూజియం
- ఆ స్థానంలో సచివాలయాల ఏర్పాటు
- నిరుపయోగంగా సైన్స్ పరిశోధనా పరికరాలు
- పట్టించుకోని అధికారులు



సైన్స్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని చెన్నూరు బస్టాండు సమీపంలో విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం కల్పించేందుకు 2006లో అప్పటి కలెక్టరు అశోక్‌కుమార్ చైర్మన్‌గా జిల్లా సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేశారు. వైస్ చైర్మన్‌గా అప్పటి డీఈవో బాలయ్య నియమితులయ్యారు. ఆ రోజుల్లోనే దాదాపు రూ.20 లక్షల వ్యయంతో సైన్స్ పరికరాలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మ్యూజియం విద్యార్థులకు అందుబాటులో ఉండేది. జిల్లా నలుమూలల నుంచి వచ్చి విద్యార్థులు సైన్స్ మ్యూజియంను సందర్శించేవారు. సైన్స్ ఉపాధ్యాయులు కూడా ఎంతో ఉత్సాహంతో విద్యార్థులకు సైన్స్ పరికరాలు చూపిస్తూ వాటిని ప్రయోగాత్మకంగా బోధించేవారు.



సోలార్‌మీటర్

మ్యూజియంలోని పరికరాలు

- **రోలర్ బాల్ :** భూమి ఆకర్షణ ద్వారా వివిధ రకాల శక్తిమార్పిడి గురించి వివరించేందుకు సైన్స్ మ్యూజియంలో ప్రయోగాత్మకమైన పరికరం రోలర్‌బాల్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు అది దేనికీ పనికి రాకుండా ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ చిలుము పట్టి మూలకు చేరింది.
- **సౌండ్ సోనామీటర్:** ధ్వని వేగాన్ని నేరుగా విద్యార్థులకు తెలియజేసేందుకు సౌండ్ సోనామీటరు ఉపయోగపడుతుండేది. శూన్యంలో ధ్వని ప్రయాణం చేయదు అన్న భావనను ఈ పరికరం ద్వారా తెలుసుకోవచ్చు.
- **విద్యుత్‌శక్తి :** యాంత్రికశక్తిని విద్యుత్ శక్తిగా మార్చే ప్రయోగాత్మక పరికరం.

వీటితో పాటు మరెన్నో సైన్స్ పరికరాలు మూలకు చేరి, ఎందుకూ పనికి రాకుండా పోయాయి.

విలువైన పరికరాలు నిర్వీర్యం

విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించేందుకు సైన్స్ మ్యూజియంలో ఎంతో విలువైన సైన్స్ పరికరాలు, పుస్తకాలు ఉండేవి. శాస్త్రీయ పరిశోధనల వైపు విద్యార్థులను నడిపించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతుండేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా సచివాలయ వ్యవస్థను తీసుకురావడం ఈ సైన్స్ మ్యూజియంకు శాపంగా మారిందని చెప్పాలి. మ్యూజియంలో ఉన్న విలువైన పరికరాలను ఒక మూల కుప్పలుగా వేసి నిర్వీర్యం చేశారు.



కుప్పలు తెప్పలుగా పుస్తకాలు, బ్రోచర్లు

సచివాలయాల ఏర్పాటు

గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ జిల్లా సైన్స్ విద్యార్థులకు శాపంగా మారిందని చెప్పాలి. కడప నగరంలో ప్రభుత్వానికి సంబంధించిన ఎన్నో ఖాళీ భవనాలు ఉన్నప్పటికీ వాటిలో సచివాలయాలు ఏర్పాటు చేసుకోకుండా.. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న సైన్స్ మ్యూజియంను తొలగించి ఆ స్థానంలో రెండు సచివాలయాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు విజ్ఞానం అందే విషయంలో వైసీపీ ఎంత ప్రాధాన్యం ఇస్తుందో ఈ ఒక్క ఉదాహరణ చాలు.



యంత్ర శక్తిని విద్యుత్‌శక్తిగా మార్చే యంత్రం

ఎన్నికల ముందు హడావిడి

గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా సైన్స్ మ్యూజియం అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ నిధులు అలాగే నిలిచిపోయాయి. తీరా సైన్స్ మ్యూజియంను అభివృద్ధి చేద్దామంటే అక్కడ సచివాలయాలు ఉన్నాయి. వైసీపీ హయాంలో మంజూరు చేసిన రూ.12 లక్షల నిధులు మ్యూజియం ఏర్పాటుకు ఏ మాత్రం కూడా సరిపోవని అంటున్నారు. కేవలం మ్యూజియం భవనం మరమ్మతులు చేయడానికే ఆ నిధులు సరిపోయే అవకాశం ఉంది. మూలనపడ్డ విలువైన సైన్స్ పరికరాలు మరలా కొత్తగా ఏర్పాటు చేయాలంటే మరిన్ని నిధులు అవసరం. ఇప్పటికైనా సైన్స్ మ్యూజియంపై కలెక్టర్ దృష్టి సారిస్తే జిల్లా విద్యార్థులకు కొంత మేలు కలిగే అవకాశం ఉంది.

త్వరలో పునఃప్రారంభిస్తాం
- డీఈవో మీనాక్షి



జిల్లా సైన్స్ మ్యూజియం త్వరలో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మున్సిపల్ కమిషనరును కలిసి చర్చించాం. సచివాలయాలను వేరే చోటకు షిఫ్ట్ చేసి మ్యూజియంను అప్పగించాలని కమిషనర్ తెలిపారు. ఒక సైన్స్ టీచరును కేర్ టేకర్‌గా నియమించాం. అలాగే సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ విభాగం ఎస్టిమేషన్ రూపొందిస్తున్నారు. సైన్స్ మ్యూజియంను మాకు అప్పగించిన వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం.

ఆ గ్రామాలకు రాకపోకలు బంద్

- గుంజన నదిపై కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు





రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె మధ్య తెగిపోయిన తాత్కాలిక రోడ్డు, నిర్మాణంలో ఉన్న వంతెన

రైల్వేకోడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో గుంజన నది ఉధృతంగా ప్రవహించడంతో రెడ్డివారిపల్లెకు వెళ్లే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో 8 రోజులుగా విద్యార్థులతో పాటు ప్రజలు రైల్వేకోడూరుకు వచ్చేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేకోడూరు నుంచి రెడ్డివారిపల్లె కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే ఉంది. ఈ నదిపై గతంలో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో వైసీపీ ప్రభుత్వంలో కొత్త బ్రిడ్జి మంజూరు చేశారు. పనులు కూడా ప్రారంభించారు. పనులు పూర్తయ్యేంత వరకు నదిపై తాత్కాలిక మట్టి రోడ్డు వేశారు. వర్షాలు వచ్చినప్పుడల్లా తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోతోంది. ఇప్పటికి 5 సార్లు కొట్టుకుపోయిందని రెడ్డివారిపల్లె గ్రామస్తులు అంటున్నారు. ప్రస్తుతం 8 రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, కూలీలు తదితరులు రెడ్డివారిపల్లె నుంచి కేఎస్ అగ్రహారం మీదుగా బయనపల్లె కట్ట నుంచి రైల్వేకోడూరుకు రావాల్సి వస్తోంది. అదేవిధంగా పాటిపాళెం మీదుగా చెరువు కట్టపై రైల్వేకోడూరుకు వస్తున్నారు. సుమారు రానుపోను 8 కిలోమీటర్ల దూరం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితేనే రెడ్డివారిపల్లె, పాటిమీదపాళెం, గుర్రపాళెం, పిల్లగుట్టకాలనీ, అగ్రహారం, దళితవాడలు, గంగిరెడ్డులమిట్ట తదితర గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం తాత్కాలిక రోడ్డు వద్ద వరద నీటి ఒరవడి ఉంది. అధికారులు అటువైపు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా కంచె వేశారు. వరద నీరు తగ్గిన తర్వాత తాత్కాలిక రోడ్డు వేస్తామని రోడ్లు భవనాల శాఖ అధికారులు అంటున్నారు.

పోలీసుల ముమ్మర విచారణ

- పోలీసుల అదుపులో ముగ్గురు

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పీలేరులో బయటపడిన రెవెన్యూ శాఖ నకిలీ ధ్రువపత్రాల వ్యవహారంపై పోలీసులు ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. తహసీల్దారు భీమేశ్వరరావు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం పీలేరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్, స్థానిక స్టాంపురైటర్ ఇళ్లలో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. అంతే కాకుండా ఈ విషయాన్ని స్థానిక పోలీసులు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన బుధవారం సాయంత్రం పీలేరుకు చేరుకుని ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించారు. రాయచోటిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి అనుమానాస్పద మృతి ఉదంతం వెలుగులోకి రావడంతో ఆయన హుటాహుటిన అక్కడకు వెళ్లిపోయారు. గురువారం పీలేరు ఎస్ఐ బాలకృష్ణ తహసీల్దారు భీమేశ్వరరావుతో చర్చలు జరిపారు. కంప్యూటర్ ఆపరేటర్, స్టాంపు రైటర్‌తోపాటు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

లాటరీ విక్రేతల బైండోవర్

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న ఏడుగురిని పోలీసులు తహసీల్దారు ముందు బైండోవర్ చేశారు. ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ తమకు అందిన రహస్య సమాచారం మేరకు పట్టణంలోని పలుచోట్ల దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.53,750లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం తహసీల్దారు ముందు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

- అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగిన పురవీధులు



అయ్యప్పస్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

రాయచోటిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శివాలయం చెక్‌పోస్టు దగ్గర వెలిసిన ఉమామహేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా హరహరసుతునికి అభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. ప్రతియేటా అయ్యప్పస్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా శివపార్వతులతో పాటు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణతో గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రామోత్సవ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు నటరాజ స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి టీడీపీ నేత మడితాటి శ్రీనివాసులరెడ్డి, ఆలయ పర్యవేక్షకులు శివగంగిరెడ్డితో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ వ్యవస్థాపకులు హరినాధ్‌రెడ్డిలు ప్రారంభించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు అయ్యప్ప స్వాములతో పాటు మహిళా భక్తులు కూడా పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ గ్రామోత్సవం కార్యక్రమం శివాలయం నుండి ఎస్ఎన్‌కాలనీ, నేతాజీ కూడలి, బస్టాండు మీదుగా కొత్తపేట, మదనపల్లె రోడ్డు వరకు కొనసాగింది. ఈ గ్రామోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రాఫిక్ సీఐ విశ్వనాధ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నారా లోకేశ్ పట్టుదలతో విద్యారంగంలో మార్పులు

- రీజనల్ టెక్‌ఫెస్ట్‌లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి



విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలానికి తగిన విధంగా మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో సమూల మార్పులకు పట్టుదలతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజినల్ టెక్ ఫెస్ట్-24ను గురువారం ఆయన ప్రారంభించారు. సంప్రదాయ చదువులకు కాలం చెల్లిందని, సృజనాత్మక చదువుల వల్లే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. తాము హైదరాబాదులో చదువుకున్న కారణంగానే ఆ స్థాయి విద్యా సంస్థలను కలికిరిలో ఏర్పాటు చేసేందుకు ప్రేరణ పొందినట్లు చెప్పారు. ఫలితంగానే కలికిరి ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నారు. పదేళ్ల క్రితం ఉమ్మడి ఏపీలో ఒకే ఒక్క సైనిక్ స్కూల్ కోరుకొండలో మాత్రమే ఉండేదని, అప్పట్లోనే రెండో సైనిక్ స్కూల్‌ను కలికిరిలో ఏర్పాటు చేయడంలో విజయవంతమయ్యామన్నారు. విభజిత ఏపీలో మాత్రమే ప్రస్తుతం రెండు సైనిక్ స్కూళ్లు ఉన్నాయని చెప్పారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో మరో రెండు కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తెస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంత చిన్న మండలంలో ఇన్ని రకాల విద్యా సంస్థలు ఏర్పాటు కావడానికి నల్లారి కుటుంబం అంకితభావమే కారణమని ప్రశంసించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు టెక్‌ఫెస్ట్‌లు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. అనంతరం టెక్‌ఫెస్ట్‌లో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు రూపొందించిన అనేక రకాల నూతన ఆవిష్కరణల ప్రదర్శనను కిశోర్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఒక్కోదాని ప్రాధాన్యతను, పనితనాన్ని, వాటి అవసరాన్ని గురించి వాటిని రూపొందించిన విద్యార్థులు వివరించారు. మొత్తం 75 మంది విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్, ఫార్మసీ కళాశాలల నుంచి ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ టెక్‌ఫెస్ట్‌లో పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణల ప్రదర్శనలను తిలకించడానికి స్థానిక ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటిలో ఉద్రిక్తత

- గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- పెద్దల జోక్యంతో ముగిసిన వివాదం

రాయచోటి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ఠానా సర్కిల్‌లో గురువారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి జాతీయ రహదారిలో వాహనాలు నిలిచిపోయాయి. సకాలంలో ఓ వర్గానికి చెందిన పెద్దలు జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగించారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి ఎస్ఎన్ కాలనీ శివాలయం నంది సర్కిల్ నుంచి అయ్యప్ప స్వాముల గ్రామోత్సవం మొదలైంది. ఎస్ఎన్ కాలనీ, నేతాజి సర్కిల్, ఠానా, కంసల వీధి, గాంధీబజార్, కొత్తపేట, జగదాంబసెంటర్, మదనపల్లె రోడ్డు మీదుగా అయ్యప్పస్వాముల గ్రామోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వాముల గ్రామోత్సవం ఠానా సర్కిల్ దాటుకోగానే ఏం జరిగిందో ఏమో మరో వర్గం ఆందోళనకు దిగింది. పెద్ద సంఖ్యలో జనం గుమికూడారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు గంటపాటు ఆగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆందోళన వర్గానికి చెందిన మతపెద్దలు, పట్టణంలోని కొందరు ప్రముఖులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను శాంతింపచేశారు. అదేసమయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సైతం ఆందోళన చేస్తున్న వర్గానికి చెందిన ముఖ్యులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను సర్దుబాటు చేయాలని కోరారు. దీంతో ఎట్టకేలకు ఎటువంటి హింసాత్మక సంఘటన జరగకుండా ఆందోళన విరమించారు. సంఘటనా స్థలానికి రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన ఎస్ఐలు, పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది చేరుకుని బందోబస్తు నిర్వహించారు.



ఠాణా సర్కిల్‌లో గుమికూడిన ఓ వర్గానికి చెందిన ప్రజలు

ఆధునికం.. వేగవంతం...

● సాంకేతికతకు పెద్దపీట
● తగ్గుతున్న ఖర్చు
● యాంత్రీకరణతో ముందడుగు


నాడు ఎద్దులతో సేద్యం


తూర్పారబడుతున్న రైతులు


పవర్ స్ప్రేయరుతో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవన ప్రవాహంలో వేగం పెరిగింది. ఇందుకు అనుగుణంగా సాంకేతికతలో ఆధునికత సంతరించుకుంది. మారుతున్న కాలానికనుగుణంగా రైతు వినూత్న పద్ధతుల ద్వారా సాగుకు నడుం బిగిస్తున్నారు. అంతేకాకుండా రైతులు సైతం సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారు. వ్యవసాయంలోనూ యాంత్రీకరణను వినియోగిస్తున్నారు. దీంతో వ్యవసాయ పద్ధతుల్లో వేగం పెరుగుతోంది. ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నందున రైతన్నకు వ్యవసాయం మరింత సులభతరమైంది. వివరాల్లో కెళితే...


రాజుపాలెం మండలంలో 13 పంచాయతీలకు దాదాపు 28వేల ఎకరాల్లో పంట సాగులో ఉంది. ఎద్దుల ద్వారా పంట పొలాలు దున్ని విత్తనం వేస్తున్న రోజుల్లో ఎకరాకు వరి పది నుంచి 12 బస్తాల శనగలు 3 నుంచి 4 క్వింటాళ్లు, జొన్నలు 10 క్వింటాళ్ల పంటను పండించే వారు. పంటల నూర్పిళ్ల కోసం నానా అవస్థలు పడేవారు. ప్రతి రైతు సొంత పొలాల్లో కల్లం ఏర్పాటు చేసుకుని ఎద్దుల బండ్ల ద్వారా కల్లాలకు తరలించి వాటిని నూర్పిళ్ల చేసి పంటను ఇంటి ముందు కర్ణాల్లో నిల్వ చేసుకునేవారు. మందు పిచికారీ సైతం బుడ్డ పంపులతో రోజుకు ఎకరా పొలానికి మందు పిచికారీ చేసుకునే రైతన్నకు 2012 నుంచి నేటి వరకు యాంత్రీకరణ ఆధునిక పద్ధతులు రావడంతో ఎద్దుల స్థానం నుంచి ట్రాక్టరు మొదలైంది. రోజుకు 2 ఎకరాలు సాగు చేసుకునే రైతుకు ట్రాక్టరు ద్వారా 10 ఎకరాల నుంచి 20 ఎకరాలు సేద్యం చేసుకునే స్థాయికి అడుగు పడింది. విత్తనం గొర్రు, పిల్లర్లు, గేజ్‌వీలర్‌తో దమ్ము చేయడం, చెత్తకట్టలు యంత్రం ద్వారా చుట్టలు చుట్టడం, పవర్ స్ప్రేయర్లతో మందు పిచికారీ చేయడం వల్ల ఎకరా నుంచి ఐదెకరాలు సాగు చేసుకునేందుకు సిద్ధమైన రైతుకు వ్యవసాయం మరింత సులభతరమైంది. ట్రాక్టరు పంపు ద్వారా మందు స్ప్రే చేస్తే రోజుకు పదెకరాల పంటకు మందు స్ప్రేచేయవచ్చు. దీంతో ఖర్చులు కూడా బాగా తగ్గాయి. తరువాత స్థానంలో డ్రోన్ ద్వారా మరింత మందు పిచికారీ చేయడం సులభతరమైంది. పంట నూర్పిళ్ల యంత్రాలు రావడంతో రోజుకు ఎకరా వరి పంట కోసి వాటిని నూర్పిళ్ల చేసుకునే రైతన్న రోజుకు పదెకరాల పంటను నూర్పిళ్లు చేస్తున్నారు. తూర్పారబట్టే బాధలేకుండా పంటను డైరెక్టుగా ఇంటికి తెచ్చుకునే సౌకర్యం ఏర్పడింది. ఇలా వ్యవసాయ యాంత్రీకరణతో రైతుకు దిగుబడి పెరిగింది. ఎకరాకు 25 బస్తాల వరి ధాన్యం నుంచి 35 బస్తాలు, 10 క్వింటాళ్ల జొన్న నుంచి 25 క్వింటాళ్లు, 3 క్వింటాళ్ల శనగ నుంచి 12 క్వింటాళ్లకు పెరగడంతో రైతులు ఆధునిక యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. ఖర్చు తగ్గడంతో రైతులు కొంత మేర కోలుకుంటున్నారు. ధాన్యాన్ని ప్రైవేటు గోదాము, ప్రభుత్వ గోదాముల్లో కూడా నిల్వ ఉంచడం, వాటిపై రుణం కూడా ఇవ్వడంతో మరింత ముందుకు సాగారు. ఏదేమైనా యాంత్రీకరణ ద్వారా రైతుకు వ్యవసాయం సులభతరమైంది.


నేడు ఆధునిక పద్ధతిలో ట్రాక్టరుతో సేద్యం చేస్తున్న దృశ్యం


ఆధునిక యంత్రం ద్వారా కోత


డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

వ్యవసాయం సులభం



50 ఏళ్లగా వ్యవసాయం చేస్తున్నాం. కాడెద్దులతో పంట దున్నడం, పంట వేసుకోవడంతో చాలా ఇబ్బందులు పడే వారం. దానికి తోడు కూలీల కొరత ఉండేది. యాంత్రీకరణతో వ్యవసాయం సులభతరమైంది. ఆధునిక యుగంలో ప్రతి పనికీ ఇంజనీరింగ్ వ్యవస్థ అభివృద్ధి చెంది కొత్త కొత్త పరికరాలు రావడంతో వ్యవసాయం సులభతరమైంది.

సుధాకర్‌రెడ్డి, తొండలదిన్నె

కూలీల కొరత తగ్గింది



వ్యవసాయ పనులు చేయాలంటే కూలీలు దొరక్క ఒకరి తర్వాత ఒకరు చేసుకునే వారు. పంట నూర్పిళ్లలో ఎంతో శ్రమపడేవారం. శనగ పంట పంటల్లో మందు పిచికారీ చేయడం, బుడ్డపంపు పవర్ స్ప్రేయర్ల ద్వారా కూలీలు ఇబ్బంది పడేవారు. ఎకరాకు 500 ఖర్చు వచ్చే తరుణంలో యాంత్రీకణ ఖర్చు తగ్గి స్తోంది.

సోము నారాయణరెడ్డి, రైతు


సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

● డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ

కడప రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్(జడ్పీసీఈఓ) ఓబులమ్మ, వైస్ ప్రిన్సిపాల్(డీపీఓ) రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రక్రియపై విస్తరణాధికారులు(ఈఓపీఆర్‌డీలు), పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్‌ఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు జిల్లా స్థాయి శిక్షణను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్, ఆర్‌జీఎస్‌ఏ నిధులతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ(ఏపీఎస్‌ఆర్‌ఐడీ అండ్ పీఆర్) ఆధ్వర్యంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై డిసెంబరు 5, 6 తేదీల్లో రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. రెండు బ్యాచ్‌ల ద్వారా ప్రతి మండలం నుంచి ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్‌ఓ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మండలానికి ఒకరు చొప్పున మొత్తం ఆరుగురు హాజరవాలన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తైన తరువాత డిసెంబరు 10 నుంచి 19 వరకు మండలాల్లో సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులకు, మండల లైన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు, సెక్రటేరియట్ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. అభివృద్ధి ప్రణాళికలు సక్రమంగా తయారు, అమలు చేయాలన్నారు. లేకుంటే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధుల విషయంలో మనం వెనుక బడే ప్రమాదం ఉందన్నారు. అందు కోసం ఈ శిక్షణను జిల్లా, మండల స్థాయిలో పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ అధికారులు అబ్జర్వర్‌గా శిక్షణకు హాజరై పూర్తిగా పర్యవేక్షిస్తారన్నారు. ఈ విషయాలను శిక్షకులు దృష్టిలో పెట్టుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను విధినిర్వహణలో అమలు పరిచి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. ఈ శిక్షణలో డీపీఆర్‌సీ ఏఓ బండపల్లె నాగభూషణం ఆయా మండలాల విస్తరణాధికారులు(ఈఓపీఆర్‌డీలు), పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్‌ఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎస్పీకి ఉధృతంగా వర్షం నీరు


లోయరు సగిలేరు నుంచి ప్రవహిస్తున్న నీరు

బి.కోడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లోయర్ సగిలేరు ప్రాజెక్టుకు బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువ తట్టు నుంచి డ్యాంకు వెయ్యి క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతుంది. దీంతో సగిలేటికి 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇంకా డ్యాంకు వర్షం నీరు అధికంగా చేరుతోందని అప్రమత్తంగా ఉంటూ ఎప్పటి కప్పుడు డ్యాంకు చేరే నీళ్లను పరిశీలిస్తూ సగిలేటికి ఇంకా విడుదల పెంచుతామని ఆయన తెలిపారు.

ఎన్‌టీఏ నూతన కార్యవర్గం ఎంపిక


ఎన్‌టీఏ నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నోబుల్‌టీచర్స్ యూనియన్ జిల్లా నూతన అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా రామక్రిష్ణంరాజు, రామసుబ్బన్న ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా కె.రవీంద్ర, ఆర్థిక కార్యదర్శిగా ఎ.చలపతిరాజు, రాష్ట్ర కౌన్సిలరుగా కె.అబ్దుల్‌గఫార్ ఎన్నికైనట్లు ఎన్‌టీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు తెలిపారు. గురువారం ఎన్‌టీఏ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్‌టీఏ నేతలు లక్ష్మీనారాయణ, మురళీమోహన్‌రాజు, కులశేఖర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి



రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తబజారు వీధి వాసి పఠాన్ దౌలత్‌బీపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. గత రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బుర్ఖా వేసుకుని వచ్చి బాధితురాలి కంట్లో కారం చల్లి కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. కేకలు వేయడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే స్థానికులు బంధువులకు సమాచారం అందించి ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనపై గురువారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు బంధువులు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రామాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో బినాతి మోహన్ (48) మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు కసిరెడ్డిగారి పల్లి పంచాయతీ కొత్తపల్లి వాసి మోహన్ గురువారం తెల్లవారుజామున గ్రామ శివారులోని తన పొలానికి నీరందించేందుకు వెళ్లాడు. మోటారు ఆన్ చేసే యత్నంలో, కిందపడి ఉన్న విద్యుత్ వైరును తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ, సిబ్బంది మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కమీషన్లు పెంచకపోతే ఆందోళన తప్పదు

● తక్షణమే గెజిట్ ప్రకారం ఇవ్వాలి
● ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్


ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్ నేతలు

కడప(క్రైం)డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాలపై ప్రభుత్వం చెల్లించే కమీషన్లు 9శాతం నుంచి గెజిట్‌లో పేర్కొన్నట్లు 20 శాతానికి పెంచకపోతే ఆందోళనకు దిగుతామని ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 14వతేదీ నుంచి మద్యం కొనుగోలు నిలుపుదల చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వైన్స్‌అండ్‌బార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వారు ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ఇస్తున్న కమీషన్లు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి 20శాతం పెంచాలని కోరారు. కార్యక్రమంలో బార్, వైన్ షాపుల యాజమాన్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవరుకు తీవ్రగాయాలు



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 108 వాహనం పైలెట్ సంగటి రమేశ్‌బాబు తీవ్రగాయాలపాలయ్యాడు. అన్నమయ్య జిల్లా గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రహ్మంగారిమఠం మండలం కంది మల్లయపల్లె రవీంద్రనగర్ వాసి రమేశ్‌బాబు తీవ్రగాయాలపాలయ్యాడు. సంఘటనా స్థలంలో ప్రజల సాయంతో దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఘాట్ రోడ్డు వెంబడి 108 వాహనాన్ని నడుపుతూ వస్తుండగా ఒక్కసారిగా బ్రేకులు ఫెయిల్ అయి ప్రమాదవశాత్తు డివైడరుకు ఢీకొన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పైసలు లేనిదే పని జరగదు

● అర్జీలు ఇవ్వడం ప్రహసనమే... ● పడిగాపులు కాస్తున్న అర్జీదారులు


ఆర్డీఓ చాంబర్ వద్ద పడిగాపులు కాస్తున్న అర్జీదారులు

జమ్మలమడుగు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయిలో రెవెన్యూ సదస్సులకు పరిష్కారం మార్గం కావాలంటే రెవెన్యూ డివిజనల్ అధికారిని సంప్రదించాలి. అయితే ఇక్కడ ఆర్డీఓను కలవాలంటే ఆర్డీఓ చాంబర్‌లో ప్రధాన గేటు వద్ద పైసలు ఇవ్వనిది అర్జీదారులు లోనికి వెళ్లలేరనే ఆరోపణలున్నాయి. అంటే దేవుడు కరుణించాలంటే పూజారి చేయి తడవాల్సిందేనని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. కార్యాలయంలోకి అర్జీదారులను మాత్రమే పంపాలని, ఇతరులను పంపకూడదని ఆర్డీఓ సిబ్బందికి చెప్పినట్లు తెలుస్తోంది. గురువారం ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో ఆర్డీఓ సాయిశ్రీకి అర్జీదారులు వినతి పత్రాలు అందించే సమయంలో ఫొటోలు తీయకూడదని స్వయంగా ఆర్డీఓ తెలపడమే ఇందుకు నిదర్శనగా చెప్పవచ్చు. వివరాల్లోకెళితే...

జమ్మలమడుగు డివిజన్ రెవెన్యూ కార్యాలయం పరిధిలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల తదితర ప్రధాన ప్రాంతాలున్నాయి. రెవెన్యూ పరిధిలో ప్రజలకు ఉత్పన్నమయ్యే వివిధ సమస్యలకు బాధితులు అర్జీలతో వస్తారు. ఆర్డీఓ చాంబర్ ప్రధాన గేటు వద్దే సంబంధిత సిబ్బందితో మాట్లాడి లోనికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే గురువారం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన అర్జీదారులను మాత్రమే పంపాలని, ఇతరులను పంపకూడదని ఆర్డీఓనే స్వయంగా సిబ్బందికి చెప్పినట్లు తెలుస్తోంది. అయితే అర్జీదారులు అందజేసిన అర్జీలు బుట్టదాఖలు అవుతున్నాయని బహిరంగ ఆరోపణలున్నాయి. రాజకీయ నాయకులు చెప్పిన వాటికే, అది కూడా పైసలు లేనిది పని జరగడంలేదని అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా జమ్మలమడుగు మండలం గొరిగెనూరు నుంచి కె.నాగలక్ష్మి, భర్త చెన్నప్పతో కలిసి ఆర్డీఓ కార్యాలయం వద్దకు అర్జీ తీసుకుని వచ్చారు. వారిని లోనికి పంపలేదని చేస్తున్నారని వాపోయారు. గతంలో కూడా అర్జీలు ఇచ్చామని, 1.23 ఎకరాల పొలం సమస్య ఉందని, అధికారులకు చెప్పినా ఏ ఒక్కరూ ఇంతవరకూ రాలేదని, పని జరగకపోవడంతో మళ్లీ అర్జీ తీసుకువచ్చామని బాధిత హరిజన మహిళ మొరపెట్టుకుంది. ఆర్డీఓ కార్యాలయంలో కాకుండా రెవెన్యూ కార్యాలయంలో సైతం కిందిస్థాయి నుంచి నిర్లక్ష్యం చేస్తున్నారని, పైసలు లేనిది ఎక్కడా పని జరగడంలేదని బాధిత మహిళ వాపోయింది. ఎర్రగుంట్ల వాసి గౌతమి రేషన్ డీలర్ షాపు నిర్వహిస్తోంది. అయితే రెవెన్యూ అధికారులు బెదిరిస్తున్నారని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆర్డీఓ సాయిశ్రీకి సమస్యల గోడు చెప్పేందుకు వచ్చామని, ఇక్కడా రాజకీయం, కాసులు రాజ్యమేలుతోందని ఎంత సేపటికీ ఆర్డీఓ వద్దకు పంపరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వి.శ్రీనివాసులరెడ్డి అర్జీలు అనేకసార్లు ఇచ్చినట్లు, ఆరు నెలల నుంచీ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారం కోసం కాళ్లకు చెప్పులరిగేలా తిరుగుతున్నా, ముగ్గురు ఆర్డీఓలు మారినా ఫైలు మాత్రం కదలడంలేదని వాపోయాడు. డబ్బు ఇవ్వాలని అక్కడున్న సిబ్బంది అడుగుతున్నట్లు ఆయన ఆరోపించారు. డివిజన్ పరిధిలో దాదాపు 300 రేషన్ డీలర్ల యజమానుల నుంచి అందినకాడికి ఒక్కొక్కరితో నాలుగు నుంచి రూ.5 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. జమ్మలమడుగు, కొండాపురం, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి సుమారు 30దాకా అర్జీలు వచ్చినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రెవెన్యూ కార్యాలయాల్లో జిల్లా అధికారులు విచారణలు చేయాలని, ఆర్డీఓ కార్యాలయంలో కొన్నేళ్లగా కొందరు బదిలీ కాకుండా ఇక్కడే నన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పలు సమస్యలపై అర్జీదారులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విప్లవాత్మక ఆవిష్కరణకు భారత్, యూకే పేటెంట్

పేటెంట్ గ్రహీత ప్రొఫెసరు రఘుబాబుకు వైస్‌చాన్సలర్ ప్రశంసలు


పేటెంట్ గ్రహీత రఘుబాబును అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్టారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో శాస్త్రసాంకేతిక రంగంలో అద్భుతాలు కొనసాగుతున్న వేళ వైవీయూ జియాలజీ విభాగం, టీఎస్‌ఐఆర్ నేషనల్ జియోఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త పరిశోధనల ద్వారా రెండు ప్రతిష్టాత్మక పేటెంట్లను సాధించడం గర్వకారణంగా నిలిచింది. 'జియో ఇంటిగ్రేటెడ్ సాయిల్ ప్రాపర్టీ డివైజ్ విత్ ఎంటాన్ జీపీఎస్ అక్యురసీ' ఆవిష్కరణకు భారత ప్రభుత్వ పేటెంట్ లభించగా, 'జియో పేషియల్ మల్టీ సెన్సార్ సాయిల్ టెస్టింగ్ ప్రొబ్ ఆవిష్కరణకు యూకే డిజైన్ పేటెంట్ లభించింది. ఈ రెండు ఆవిష్కరణలు భూసార పరిశోధన రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాయి. ఈ పరికరాలు భూమి క్షారగుణాలను ఖచ్చితంగా గుర్తించి భౌగోళిక సమాచారాన్ని సమర్థవంతంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. జీపీఎస్ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి భూసారం విశ్లేషణను అధునాతనంగా మార్చే ఈ పరికరాలు భూసార పునరుద్ధరణ, వ్యవసాయం, భూమి వినియోగ సామర్థ్యాలను మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తాయి. ఈ విజయాల్లో పరిశోధకులు అనూష బోయ నక్కల, డాక్టర్ ప్రదీప్‌కుమార్ బాలుపల్లి, డాక్టర్ చత్రం గుగ్గిలోతు, వైవీయూ ప్రొఫెసరు రఘుబాబు కొట్టాల, పద్మశ్రీ, దీపిక కృషి ముఖ్యమైనది. వారు ఆవిష్కరించిన ఈరెండు పరికరాలు వ్యవసాయేతర రంగాలకు కూడా విస్తృత ప్రయోజనాలు అందిస్తున్నాయి. వైస్‌ఛాన్సలరు క్రిష్టారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి, రిజిస్ట్రారు పద్మ, భూగర్భశాస్త్రవిభాగం ప్రొఫెసరు సునీత, ప్రొఫెసరు జయారాజ్, శ్రీనివాస్‌గౌడ్, టీఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ సవిత, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

సిద్దవటం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థలం వివాదం విషయంలో విచారణకు వెళ్లిన లింగంపల్లి వీఆర్‌ఏ కిశోర్‌పై కాజీపల్లెకు చెందిన నిమ్మకాయల ఓబులరెడ్డి, జయరాం రెడ్డి దాడి చేసిన విషయం తెలిసిందే. గురువారం ఈ కేసు విషయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు గ్రామంలో విచారణ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

వైవీయూ విద్యార్థికి మరో కాంస్యం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ దక్షిణ అంతర్ విశ్వవిద్యాలయ పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వైవీయూకు మరో కాంస్య పతకం లభించింది. దీంతో వైవీయూ మొత్తంమూడు పతకాలు సొంతం చేసుకుంది. కమలాపురం సీ ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం కళాశాల విద్యార్థి రాజశేఖర్ 109 కిలోల విభాగంలో నాక్‌లో 124 కిలోలు, క్లీన్‌జర్క్ విభాగంలో 171 కిలోలు మొత్తం 295 కిలోలు బరువు ఎత్తి మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. రాజశేఖర్‌ను వైస్‌చాన్సలర్ స్పోర్ట్స్ బోర్డు చైర్మన్ క్రిష్టారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి, వ్యాయామవిద్య సెక్రటరీ కె.రామసుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

వర్షం ధాటికి నేలకూలిన ఇల్లు

ఒంటిమిట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దర్జిపల్లెలో వర్షం ధాటికి రెండు పాడుబడిన ఇళ్ల పైకప్పు కూలి నేలకూలాయి. వర్షం ధాటికి ఇళ్ల నేల కూలుతాయని ముందస్తు సమాచారంతో పక్కన ఇంటికి పోయారని, ఇంట్లో సామాన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసం అయ్యాయని గ్రామస్థులు తెలిపారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

నేడు ఆకేపాటి తిరుమల పాదయాత్ర

రాజంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం 22వ తిరుమల మహా పాదయాత్ర ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఆకేపాడు గ్రామంలోని ఆకేపాటి ఎస్టేట్ టీటీడీ కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 1.30కి పాదయాత్ర ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు రాజంపేట పట్టణం మన్నూరు ఎల్లమ్మ దేవాలయానికి చేరుకుంటుందన్నారు. రాత్రి ఏడు గంటలకు ఎస్ఆర్ కల్యాణ మండపం చేరుకుంటుందన్నారు. 7, 8, 9 తేదీల్లో పాదయాత్ర కొనసాగి 9వ తేదీ సాయంత్రం తిరుమలకు చేరుకుంటుందన్నారు. ఈ పాదయాత్రలో అందరూ పాల్గొని శ్రీవారి కరుణాకటాక్షాలను పొందాలని విజ్ఞప్తి చేశారు.

పింఛా ఎడమ కాలువకు నీరు విడుదల


ఎడమ కాలువలో ప్రవహిస్తున్న నీరు

సుండుపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పింఛా జలాశయం దిగువ భాగంలోని ఎడమ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ గురువారం తెలిపారు. రెండు రోజుల క్రితం ప్రాజెక్టు గేట్లతో పాటు, కుడికాలువకు నీటిని విడుదల చేశామన్నారు. ఎడమ కాలువకు మరమ్మతులు చేసి గురువారం నీరు విడుదల చేసినట్లు తెలియజేశారు. నీటిని వృథ చేయకుండా కుంటలు, చెరువులనునింపేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

వీరబల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచి పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. వీరబల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామాల వారీగా పనులపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఆంజనేయులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుకు చేరుతున్న వర్షపునీరు

ఒంటిమిట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చెరువుకు నడింపల్లె, చెర్లోపల్లె గ్రామాల నుంచి వంకద్వారా నీరు చేరుతోంది. సాగు నీరు లేక పంటలు ఎండుతున్న పరిస్థితుల్లో చెరువుకు నీరు వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 62.5 వర్షపాతం నమోదైందని రైతులు, పాత ఇళ్లల్లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రమణమ్మ విజ్ఞప్తి చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రామాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రాయచోటి బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు గురువారం సీజ్ చేశారు. దానిని రామాపురం పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు తప్పక హాజరుకావాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రేపు నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక హాజరుకావాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పాఠశాల కమిటీ చైర్మన్ యనమల మణి ఆహ్వాన పత్రికలను పిల్లలకు అంద జేసి ఈ సమావేశాన్ని జయప్రధం చేయాలని తల్లిదండ్రులను కోరారు.

చినుకు పడితే చిక్కే..!


ఒంటిమిట్టకు వెళ్లే రహదారి

- బురదమయమవుతున్న రహదారులు
- వాహనదారుల ఇబ్బందులు
- హామీలకే పరిమితమైన వాగ్దానాలు

సిద్దవటం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు రోడ్లు బురదమయమవుతున్నాయి మండలంలోని నేకనాపురం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేకనాపురం మీదుగా వెళ్లే మార్గం ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఒంటిమిటకు దగ్గరి దారి కావడంతో బద్వేలు, పోరుమామిళ్ల, బ్రహ్మంగారిమఠం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎక్కువగా ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. కొంత కాలంగా ఈ మార్గం అభివృద్ధిపై నాయకులు ఏమాత్రం చొరవ చూపకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని ప్రజాప్రతినిధులు చేసిన వాగ్దానం అమలుకు నోచుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం చినుకు పడితే చాలు బురదమయమయ్యే పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఈ రహదారి మరీ అధ్వానంగా ఉండడంతో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వమైనా ఈ రహదారి అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పాఠశాల ఎదురుగా అధ్వానంగా ఉన్న రోడ్డు

అభివృద్ధి శూన్యం



గత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు గ్రామాలకు వచ్చి అభివృద్ధి పనులు చేపడతామని చెప్పి వెళ్లా రు. మళ్లీ కనిపించలేదు.చినుకు పడితేనే చాలు రోడ్లలో నడవలేని పరిస్థితి ఉంది.

\- గంగారెడ్డి, నేకనాపురం

రోడ్లను బాగు చేయాలి



రోడ్లు దుర్భరంగా మారడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా నాయకులు దృష్టి సారించాలి.

\- నడిపి వెంకటసుబ్బయ్య, నేకనాపురం

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు

రాయచోటిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించడంతోపాటు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలంటూ గురువారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తపల్లెలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఎజాజ్‌అహ్మద్‌ను తరగతి గదిలోనే హత్య చేయడం సమాజం సిగ్గుపడాల్సిన చర్య అన్నారు. ఈ విషయంలో నిష్పక్షపాతంగా విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని, ఉపాధ్యాయుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, భవిష్యత్తులో ఉపాధ్యాయులపై ఎటువంటి దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుడి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి రామాంజులు, నాయకులు మాధవ్, మహేశ్ కోరారు. ఈ కేసులో సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు. యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఏపీ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఆందోళన చేశారు. ఏపీ ఎన్జీవో సంఘం రాయచోటి తాలూకా కార్యదర్శి దండు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, వీహెచ్‌వో లలిత కుమారి, ఫార్మసీ ఆఫీసర్ గంగాధర్, ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్ర, స్టాఫ్ నర్సులు కవిత, ఖాదర్‌బీ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుడి మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. గురువారం రాయచోటి ఏరియా ఆసుపత్రికి వెళ్లి ఉపాధ్యాయుడి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

సుండుపల్లె: సుండుపల్లెలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో నివాళులు అర్పించారు. పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సూర్యుడునాయక్, హెచ్ఎం అమ్మనాయక్, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

గాలివీడు: మండల కేంద్రంలో ఉపాధ్యాయులు నిరసనను తెలియజేశారు.

పుల్లంపేట: పాఠశాల విరామ సమయంలో పాఠశాల ఎదురుగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. మండల ఎస్టీయూ అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ , హెచ్ఎం బబిత, ఉపాధ్యాయులు రమణారెడ్డి, బాలనరసింహులు, అసిఫ్‌బాషా, శేషాద్రి, ప్రమీలపాల్గొన్నారు.

రాజంపేట టౌన్: రాజంపేట ఎంఈవో కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఉపాధ్యాయులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.

ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

రాజంపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిధుల కేటాయింపులో విద్యా రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలంటూ విద్యా ర్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అన్నమ య్య జిల్లా మూడో మహాసభ సందర్భంగా ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఆర్‌ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, ఇదే పరిస్థితి కొనసాగితే సంక్షేమ హాస్టళ్లన్నీ మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా సంక్షేమ హాస్టళ్లలో వసతులు మెరుగు పరచాలని, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందజేసే మెస్‌చార్జీలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాయచోటిలో ఓ ఉపాధ్యాయుడు మరణించిన సంఘటన మానవ విలువలను తూట్లు పొడిచేటట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌యూ నాయకులు వంశీ, జిల్లా ఉపాధ్యక్షుడు హరిబాబు, సహాయ కార్యదర్శి వెంకటేశ్‌నాయక్, మధు, సుకుమార్, ప్రమోద్, కిరణ్ పాల్గొన్నారు.

‘దివ్యాంగులు సామాన్యులకు తీసిపోరు’


దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినం సందర్భంగా గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సైరాభాను మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు కూడా సాధారణ విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోరని చెప్పారు. దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా వారి పిల్లలను భవితా కేంద్రానికి తీసుకొచ్చి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. అనంతరం ప్రత్యేక విద్య ఉపాధ్యాయుడు వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం ఎన్నో రాయితీలను కల్పిస్తోందని, వాటిని సక్రమంగా వినియోగించుకొని రాణించాలన్నారు. అనంతరం భవిత కేంద్రం రిసోర్స్ పర్సన్ జనార్దన మాట్లాడుతూ ఈ భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, అలవెన్స్‌లతో పాటు అమ్మాయి లకు స్టైఫండ్ కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం దివ్యాంగ దివ్యాంగ పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం టీచర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

సంబేపల్లె: సంబేపల్లె భవిత కేంద్రంలో ఎంఈవోలు రమాదేవి, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి బుధవారం ఫిజియోథెరపీ చేస్తారని, ఒక్క విద్యార్థికి నెలకు ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.300 చెల్లిస్తారన్నారు. దివ్యాంగ విద్యార్థులను పరిశుభ్రంగా ఉంచాలని వారిని చులకనగా చూడరాదన్నారు. దివ్యాంగ విద్యార్థులకు సంబేపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు జయమ్మ అరటిపండ్లు పంపిణీ చేశారు. హెచ్ఎం నాగేశ్వర్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవపట్ల చిన్నబిడికి రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సంబేపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 1.87 కోట్లతో మండలంలోని దేవపట్ల నుంచి చిన్నబిడికి వరకు ఉన్న రోడ్డు అభివృద్ధి పనులను గురువారం టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామాలను కలుపుతూ లింకురోడ్ల పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు భయారెడ్డి, ఆలంసాబ్, ఖాదర్‌హుస్సేన్, వెంకటేశ్వర్‌నాయుడు, మోహన్, పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయొడిన్ ఆధారిత రుగ్మతలపై అవగాహన

సిద్దవటం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అయొడిన్ కారణంగా ఏర్పడే రుగ్మతలపై గురువారం సిద్దవటంలోని జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ తరఫున నిర్వహించిన కార్యక్రమంలో బాలింతలు, గర్భిణుల్లో అయొడిన్ కారణంగా ఏర్పడే రుగ్మతలను తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ జ్యోతి, శివయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శించాలి

వీరబల్లి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రాజేశ్ సాఫ్ట్ బాల్, ఉప్పరపల్లి పాఠశాల విద్యార్థిని రెడ్డి కావ్య శ్రీ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థా యికి ఎంపికయ్యారు. గురువారం ఆయా విద్యా ర్థులను వారి వారి పాఠశాలల్లో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న వీఆర్‌డీఎస్ సురేంద్రా రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభను కనపర్చి వీరబల్లి మండలానికి మంచిపేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, మధుసూదన్‌రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు శేఖర్, రవీంద్రరాజు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

సుండుపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడిలో 10 గొర్రెలు మృతి చెందాయని బాధిత రైతు రమణయ్య తెలిపారు. మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీ వడ్డిపల్లికి చెందిన రమణయ్య బుధవారం రాత్రి గొర్రెలను దొడ్డిలో తోలాడు. తెలవారేసరికి కుక్కలు దాడి చేసి పది గొర్రెలను చంపినట్లు తెలియజేశారు. దీంతో రూ.1.30 లక్షలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల పెంపకమే తమ జీవనాధారమని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అన్నమయ్య నీటిని చెరువులకు మళ్లించాలి


మంత్రి నిమ్మలకు వివరాలు తెలియజేస్తున్న నాగోతు రమేష్‌నాయుడు

రాజంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో నీరంతా వృథా అవుతోందని, ఈ నీటిని పంపింగ్ ద్వారా అన్నమయ్య ఆయకట్టు చెరువులకు మళ్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. గురువారం మంత్రిని కలిసి ఈ మేరకు వినతిప్రతం సమర్పించారు. ప్రస్తుత వర్షాకాలంలో చెయ్యేరు నదిలో వరదనీరు వృథా అవుతోందన్నారు. ప్రాజెక్టు తెగిపోవడంతో ప్రాజెక్టు ఆధారిత 7 చెరువులు, 22,500 ఎకరాల ఆయకట్టుకు నీరు అందడం లేదన్నారు. పంపులను ఏర్పాటు చేసి నీటిని రాజంపేట, పుల్లంపేట పరిధిలోని అన్నమయ్య ప్రాజెక్టు పరిధిలోని చెరువులు నింపితే, ఆయకట్టు భూములకు నీరు అందుతుందన్నారు. అన్నమయ్య డ్యాం వద్ద ప్రవాహానికి అడ్డంగా తాత్కాలిక ఇసుక కట్ట ఏర్పాటు చేసి వరదనీటిని అన్నమయ్య కాలువకు మళ్లిస్తే ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలిపారు.

ప్రశాంతంగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు

నందలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే గ్రంధాలయంలో రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు రెండోరోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. రెండో రోజున 107 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలకు పోలింగ్ ఆఫీసర్‌గా మధుసూదన్‌రావు, పోలింగ్ సూపరింటెంటెంట్ శివలింగం, పోలింగ్ అసిస్టెంట్‌గా లక్ష్మీనారాయణలు వ్యవహరించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని ఆయా గ్రామాల పరిధిలోని రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలని సబ్‌కలెక్టర్ నిధియాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల భూ సమస్యలు, సర్వే సమస్యలను గ్రామస్థాయి రెవెన్యూ సదస్సుకు వచ్చి పరిష్కారం చేసుకో వాలన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకుని ఎన్నో ఏళ్ల నుంచి పరిష్కారం కాని వారి రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయండి

సుండుపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుండి మండలంలో ప్రారంభమయ్యే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని నోడల్ ఆఫీసర్ జయరాములు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. రైతు సమస్యల పరిష్కార వేదికగా నిర్వహించే ఈ సమావేశాలను విజయవంతం చేసేందుకు సూచనలు, సలహాలు అందజేశామన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొలిమేరపల్లి గ్రామ పంచాయతీలో సమావేశం జరుగుతుందన్నారు. డిసెంబరు 6వ తేదీన ప్రారంభమై వచ్చే ఏడాది జనవరి 8వ తేదీన అక్కంపల్లిలో జరిగే రెవెన్యూ సదస్సుతో సభలు ముగిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు

రాయచోటి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

మాదిగల కృతజ్ఞత సభను జయప్రదం చేయండి


రాయచోటి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న విజయవాడలో .జరిగే మాదిగల కృతజ్ఞత సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు మద్దిరేవుల రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం ఆయన పట్టణంలోని ఎన్జీవో హోంలో మాదిగల చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ సీట్లను మాదిగలకు కేటాయించి సమాన న్యాయం పాటించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎంఆర్‌పీఎస్ తెలుగు రాష్ట్రాల సమ న్వయకర్త పేరు పోగు వెంకటేశ్వరరావు ఈ నెల 10న విజయవాడలో మాదిగల కృతజ్ఞత సభను నిర్వహిస్తున్నారన్నారు.

రసాయనిక ఎరువులు విచక్షణ రహితంగా వాడరాదు

రైల్వేకోడూరు, డిసెంబరు 5:(ఆంధ్రజ్యోతి) రైతులు విచక్షణ రహితంగా రసాయనిక ఎరువులు వాడరాదని రైల్వేకోడూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కే. కవిత, మండల వ్యవసాయ శాఖ అధికారి జి. సుధాకర్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు వ్యవసాయ శాఖ ఆవరణలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ మనుగడ కోసం ప్రతి ఒక్కరు నేలలను కాపాడుకోవాలని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకంతో సూక్ష్మజీవులు, వానపాములు నశించిపోయి నేల తన స్వభావాన్ని కోల్పోతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలన్నారు. ప్రతి ఒక్క రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి పంపాలని తెలిపారు.

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు రైతు సేవా కేంద్రంలో భూసార పరీక్షలు, మట్టి నమూనా సేకరణ, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించినట్లు అగ్రికల్చర్ అధికారి మల్లిక తెలిపారు. చిన్నఓరంపాడు రైతులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతుసేవా కేంద్రం సిబ్బంది, జడ్పీఎన్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం


బాధితుడికి చెక్కు అందజేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

సుండుపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని, కష్టా ల్లో ఉన్న కుటుంబాలను ఆదు కునేందుకు ఎంతో దోహద పడుతోందని టీడీపీ రాజంపే ట ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం తెలిపారు. గురు వారం మండలంలోని జీ.రెడ్డివారి పల్లె గ్రామ పంచాయతీకి చెందిన కంచం వెంకట్రమణకు రూ.3,38,757 విలువైన చెక్కును అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెలుగు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, టీడీపీ నాయకులు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ధాటికి నేలకొరిగిన వరి


నాగూరివాండ్లపల్లెలో నేలకొరిగిన వరి పైరు

గాలివీడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో వరిపైరు నేలకొరిగింది. మండల వ్యాప్తంగా 100 ఎకరాలకు పైగా వరి పైరు నేలమట్టం అయినట్లు రైతులు చెబుతున్నారు. నూర్పిడి చేయాల్సిన సమయంలో పంటంతా నేలపాలైందన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు చెబుతున్నారు.

నీటి మడుగుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

గాలివీడు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): నీటి మడుగుల వద్దకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. గురువారం మండలంలోని గండిమడుగు వద్ద నదీ పరివాహక ప్రాంతంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత్తూ ఉమామహేశ్వరస్వామి ఆలయం, వెలిగల్లు జలాశయం ఉండటంతో గండిమడుగు ప్రాంతం కిటకిటలాడుతూ ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలోని నదిలో లోతు తెలియక పలువురు నీటిలో దిగి ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇక్కడికి వచ్చే భక్తులు, పర్యాటకులను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు రాసుకుని కొబ్బరి చెట్టుకు మంటలు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీలోని సిద్దకవాండ్లపల్లెలో గురువారం విద్యుత్ తీగలు రాసుకుని సిద్దక వెంకటరామిరెడ్డికి చెందిన షెడ్డుపై ఉన్న కొబ్బరి చెట్టుకు మంటలు అంటుకున్నాయి గ్రామంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులకు చెబుతున్నా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైటెన్షన్ విద్యుత్ లైన్లు ఊరి బయటికి తరలించాలని కోరుతున్నారు

‘ధార్మికంగా జీవించాలి’

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి); హిందువులు ప్రతి ఒక్కరు సనాతన ధర్మాన్ని పాటించడంతోపాటు ధార్మిక జీవితాన్ని గడపాలని శారదా పీఠాధిపతి స్వయంప్రకాశ్‌సచ్చిదానంద సరస్వతి స్వామీజీ ఉద్బోధించిరు. రెండురోజులుగా లక్కిరెడ్డిపల్లెలోని అన్ని దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఆయన సనాతన ధర్మంపై సత్సంగం నిర్వహించారు. ప్రతి ఒక్కరికి ఆధ్మాత్మిక చింతన అవసరమన్నారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందజే శారు. నూకల రవీంద్ర,రామచంద్రారెడ్డి, కృష్ణ, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో అమరనాథరెడ్డి

మదనపల్లె టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనలో భాగంగా నిర్వహించే సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది అవగాహన పెంచుకోవాలని డీఎల్‌డీవో అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పథకం కింద చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఔత్సాహికులను గుర్తించాలన్నారు. అనంతరం వారు ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు ఎంత ఆర్థిక సహాయం అవసరమో గుర్తించి పూర్తి వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ విషయాలన్నింటిపై ఈనెలాఖరులోగా సర్వే చేసి నివేదికలను పంపాలన్నారు. ఎంపీడీవో తాజ్ మస్రూర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి శంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట సీఐగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌బాబు



బి.కొత్తకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బి.కొత్త కోట పట్టణ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన జీవన్ గంగాధర్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జిల్లా పులివెందుల సీఐగా పనిచేస్తూ బదిలీపై కొత్తకోటకు వచ్చారు. ఇంతకాలం ఇక్కడ సీఐగా పనిచేసిన కే.రాజారెడ్డి అన్నమయ్య జిల్లా ఎస్‌బికి బదిలీ అయ్యారు. కాగా పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు నూతన సీఐ గంగాధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి బి.కొత్తకోటకు సాదర స్వాగతం పలికారు.

పీటీఎం ఎస్ఐగా రవికుమార్



పెద్దతిప్పసముద్రం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) :పెద్దతిప్పసముద్రం నూతన ఎస్ఐగా రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న నరసింహుడు బదిలీపై ములకలచెరువుకు బదిలీ కాగా మదనపల్లెలో విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ పెద్దతిప్పసముద్రం మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపి మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఎం వెంకటరమణరెడ్డి

మదనపల్లె అర్బన్, డిసెంబరు5: ఉద్యోగ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులను వన్ డిపో డీఎం వెంకటరమణారెడ్డి అభినందించారు. స్థానిక వన్ డిపో గ్యారేజ్‌లో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించి ఆదర్శ ఉద్యోగులకు డీఎం నగదు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇందులో అధిక ఆదాయం సాధించిన ఉద్యోగులు శివశంకర్, వేణుగోపాల్, టీవీ రమణ, ఎక్కువ ఈపీకే తెచ్చిన కె. సుధాకర్, బిక్షపతి, సి. సుధాకర్, లీలావతమ్మ, మిగిలిన విభాగాల్లో పిఆర్‌బేగ్, డిక్షప్ప, ఎస్ఎస్ వాసులు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పౌష్టికాహారం అందచేస్తున్న ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి

తంబళ్లపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీవో తంబళ్లపల్లె మెయిన్ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరు పట్టి, రికార్డులతో పాటు కేంద్రంలోని గుడ్లు, పాలప్యాకెట్లు, చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడతూ..చిన్నారులకు మెనూ మేరకు భోజనాలు అందించాలని సూచించారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు సకాలంలో టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్), పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం చిన్నారుల తల్లులకు టీహెచ్ఆర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి దిలీప్‌కుమార్‌నాయక్, అంగన్వాడీ వర్కర్లు ఉమాదేవి, సరస్వతి, కళావతి, హెల్పర్లు కవిత, సరస్వతీ, పద్మావతమ్మ ఉన్నారు.

రహదారికి మోక్షమెప్పుడో..?

- అధ్వానంగా తంబళ్లపల్లె-కోసువారిపల్లె రోడ్డు
- అవస్థలు పడుతున్న 15 గ్రామాల ప్రజలు
- అధికారులు స్పందించాలంటున్న జనం
- టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపడుతామంటున్న పీఏయూ ఏఈఈ



గుంతలమయంగా మారిన తంబళ్లపల్లె-కోసువారిపల్లెకు వెళ్లే రోడ్డు

తంబళ్లపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రం నుంచి కోసువారిపల్లె రోడ్డుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి గుంతలమయంగా మారడంతో 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తంబళ్లపల్లె నుంచి కోసువారిపల్లెకు వెళ్లే ప్రధాన రోడ్డు సుమారు 12 కిలో మీటర్ల మేర అధ్వానంగా మారింది. రోడ్డు ఆద్యంతం పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తే ఒళ్లు హూనమవ్వడమే కాదు..వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఎంత జాగ్రత్తగా బండి నడిపినా గోతుల్లో పడి ప్రమాదాలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తంబళ్లపల్లె మండల కేంద్రం నుంచి దాదంవడ్డిపల్లె, గుండారివారిపల్లె, రామాపురం, జొన్నచేనుపల్లె, దిగువముత్రవారిపల్లె, పాపనచెరువుపల్లె, ముత్రవారిపల్లె కోసువారిపల్లె తదితర సుమారు 15 గ్రామాలకు పైగా వెళ్లడానికి ఇదే ప్రధాన రోడ్డు. ఈ రోడ్డు మార్గాన పల్లెలు ఎక్కువగా ఉండటంతో నిత్యం వందల మంది ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాల్లో తంబళ్లపల్లెకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి వెళుతుంటారు. అంతేకాకుండా శనివారం, ఇతర ప్రత్యేకమైన పండుగ రోజుల్లో కోసువారిపల్లెలో కొలువైన వేంకటరమణ స్వామిని దర్శించుకోవడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు వందల సంఖ్య లో ఈ రోడ్డు మార్గాన వచ్చి వెళ్తుంటారు. అయి తే ఈ రోడ్డుకంకర తేలిపోయి గుంతలమయమ వడంతో ప్రయాణం సాగించాలంటే అవస్థలు పడుతున్నట్లు వాహన చోదకులు వాపోతున్నా రు. రాత్రి వేళల్లో అయితే గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఈ రోడ్డు తుపాను కారణంగా కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా తయా రైంది. దీంతో కోసువారిపల్లెకు వెళ్లే వారు కొంచెం దూరాభారమైన మదనపల్లె రోడ్డుకు ఉన్న మూలపల్లె, పంచాలమర్రి మీదుగా ఉన్న లింకు రోడ్డు మీదుగా దేవరబురుజుకు చేరుకుని అక్కడి నుంచి కోసువారిపల్లె ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రోడ్లకు మహర్దశ పట్టింది. తంబళ్లపల్లె మండల కేంద్రం నుంచి ముదివేడు క్రాస్ వరకు గోతులమయంగా ఉన్న రోడ్డుకు చేపట్టిన మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. గతంలో చాలా అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తంబళ్లపల్లె నుంచి కోసువారిపల్లెకు వెళ్లే రోడ్డుకు కూడా మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు టెండర్ ప్రక్రియలో ఉంది

తంబళ్లపల్లె నుంచి కోసువారిపల్లెకు వెళ్లే రోడ్డు (ముద్దలదొడ్డి రోడ్డు) వరకు 8కిలోమీటర్ల మేర రూ.7.65 కోట్ల నిధులతో మంజూరైంది. అయితే రోడ్డు టెండర్ ప్రక్రియలో ఉంది. టెండర్లు పూర్తి అయిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

-నిరంజన్‌కుమార్‌రెడ్డి, పీఏయూ ఏఈఈ, తంబళ్లపల్లె

ఆలయ రాజగోపురం ప్రారంభానికి సర్వం సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన రాజగోపురం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మనపల్లె రోడ్డులో ఉన్న వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణంస్వామి ఆలయ రాజగోపురం ప్రారంభానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. శనివారం రాజగోపురం ప్రారంభం సందర్భంగా కుంబాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణం, రాచపల్లె అనురాధలు తెలిపారు. ఆలయంలో మూడు రోజులుపాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం ఆలయంలో గంగపూజ, గోపూజ, మహాగణపతి పూజ, రక్షాబందన, కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం రాజగోపం ప్రారంభంతోపాటు కలశారాధన, శాంతి హోమాలు, శిఖర కళశాల ప్రారంభోత్సవం అనంతరం కుంబాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకం, వళ్లీదేవసేన సమేత సుబ్రమ్మణ్యంస్వామి కల్యాణం నిర్వహించి అనంతరం పుష్పయాగం చేస్తామన్నారు. ఆలయంలో భక్తులకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్నదాన వితరణ ఉంటుందని చెప్పారు.

వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష



బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్షిస్తున్న డిప్యూటీ ఈవో వరలక్ష్మీ

తంబళ్లపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై డిప్యూటీ ఈవో వరలక్ష్మీ సమీక్ష నిర్వహించారు. గురువారం ఈవో ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై టీటీడీ అధికారులు, గ్రామ ప్రజలు, భక్తులతో సమీక్ష నిర్వహించారు. తదనంతరం ఆలయంలో చేపడుతున్న గాలి గోపురం పనులను పరిశీలించారు. జనవరిలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో గోపురం నిర్మాణ పనులు వేగవంతం చేసి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అవినీతి మరకలు అంటిస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు అవినీతి మరకలు అంటిస్తే సహించబోమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం టీడీపీ బీసీ నాయకులు రామిశెట్టికృష్ణ, మదనపల్లె పట్టణ ఉపాధ్యక్షుడు యర్లబల్లి వెంకటరమణారెడ్డి, ఒకటో వార్డు ఇన్‌చార్జి మల్లికార్జున నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధిష్టానికి మండల తహసీల్దార్ ఖాజాబీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అదేవిధంగా పట్టణంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు విరివిగా చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్రసభ్యులు ప్రభాకర్, తమ్మిశెట్టి శ్రీరాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో చేతివృత్తులకు చేయూత



పీఎం విశ్వకర్మ యోజన పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంతో చేతివృత్తుల కార్మికులకు చేయూతగా నిలుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికులకు, ధోబీ తోపాటు 18 రకాల చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ఏడు రోజులపాటు శిక్షణతోపాటురూ. 15 వేలు విలువ చేసే పరికరాలను, శిక్షణ సమయంలో ప్రతి రోజురూ. 500 నగదును, లక్ష రూపాయాల వరకు లోను మంజూరు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు కమలమరికృష్ణ, నాదేళ్లశివ, మదనపల్లె భవన నిర్మాన కార్మిక సంఘం అధ్యక్షుడు జంగాల శ్రీని వాసులు, ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్‌స్వాతి, చక్రపాణి, కెవి ఫౌండేషన్ చైర్మన్ టీవీరమణ పాల్గొన్నారు.

కొటాల రెవెన్యూ సదస్సు మార్పు

తంబళ్లపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో ఈ నెల 7వ తేదీ నిర్వహించాల్సిన కొటాల గ్రామ రెవెన్యూ సదస్సును 9వ తేదీకి మార్పు చేసినట్లు తహసీల్దారు హరికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్(పీటీయం)ను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొటాల గ్రామ రెవెన్యూ సదస్సును మార్చినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

చెరువు కట్ట విస్తరణ పనులు ప్రారంభం



చెరువు కట్ట విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

పెద్దమండ్యం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి చెరువు కట్ట పనులు ప్రారంభమయ్యాయి. గురువారం ఇరిగేషన్ ఈఈ సురేష్ బాబు, ఏఈ శ్రీనివాసు లురెడ్డిలు పనులను ప్రారంభించి పరిశీలించారు. 'కదల ని చెరువు కట్ట విస్తరణ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో నవంబరు 30వ తేదీన వెలువడి కథనానికి మదన పల్లి డివిజన్ ఇరిగేషన్ యంత్రాంగం స్పందించింది. ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు, ఏఈ శ్రీనివాసులురెడ్డి పర్యటించి గుడిసెవారిపల్లి చెరువు కట్ట పనులను పరిశీలించి కట్ట విస్తరణ పనులు వేగవంతం చేయా లని సిబ్బందిని ఆదేశించారు.. ఈసందర్భంగా ఇరిగేషన్ అధికారులతోపాటు ఎంపీడీవో శ్రీధర్‌రావు చెరువు కట్ట విస్తరణ పనులను ప్రారంభించి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు గుడిసెవారిపల్లి చెరువు కట్ట విస్తరణ అభివృద్ధి సకాలంలో పూర్తి చేస్తామని వెల్లడించారు. దీంతో గుడిసెవారిపల్లి, పి.తురకపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు అండగా 'భవిత' కేంద్రాలు

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొల్పిన 'భవిత' కేంద్రాలు దివ్యాంగులైన విద్యార్థులకు అనే క విధాలుగా అండగా నిలుస్తు న్నాయని ఎంఈవో కరీముల్లా కితాబిచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భం గా కలికిరి ప్రధాన ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం ఉపాధ్యాయులను కూడా నియమించడం జరిగిందన్నారు. పాఠశాలకు హాజరు కాలేని దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రతి శనివారం హోమ్ బేస్డ్ విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మురాద్‌షా వల్లీ, ప్రత్యేక ఉపాధ్యాయులు ధనలక్ష్మి, రెడ్డిప్రసాద్, సీఆర్పీలు సురేష్, రియాజుద్దీన్‌లు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలోని భవిత పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారులు నారాయణ, గౌస్‌పీర్‌లు అధ్యక్షతన మండలం లోని దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర, ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: స్థానిక భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి ఎంఈవోలు వెంకటరమణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉషారాణి, ఐఈడీఎస్ కుసుమ, ఐఈఆర్‌టీలు నీరజ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వైకల్యం మనిషికే కానీ మనసుకి కాదని వాల్మీకిపురం ఎంఈవో వెంకటలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక కోనేటివీధిలోని మెయిన్ పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయండి

మదనపల్లె టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్‌నాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీహైస్కూల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21, 22వ తేదీల్లో అన్నమయ్య జిల్లా ఎస్ఎఫ్ఐ మహాసభలను మదనపల్లెలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యారంగం సమస్యలపై ఈ మహాసభల్లో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ నాయకులు సాయిచరణ్, యూటీఎఫ్ నాయకులు రవీంధ్ర, సురేంద్ర, చలపతి, నాగరాజు, వరప్రసాద్, రామచంద్ర, ముబారక్ పాల్గొన్నారు.

గ్రాట్స్‌టెక్నాలజీతో మిట్స్ ఒప్పందం



కురబలకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం బెంగళూరుకు చెందిన గ్రాట్స్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ యువరాజ్, ఆ కంపెనీ వ్యవస్థాపకుడు శ్రీనివాస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడంతో పాటుగా అవగాహన కార్యక్రమాలలో సహాయసహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఐటీ రంగంలో ఎదురయ్యే సవాళ్ళను ఎలా ఎదుర్కొనాలో తెలియజేడంతో కోడింగ్, సామర్థ్యాలను మెరుగుపరచుకోవడం తదితర వాటికి సంబంధించి సలహాలు, సూచనలు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కళాశాల విద్యార్థులు ఉమ్మడి మార్గదర్శకత్వంలో ప్రాజెక్టులు, పరిశోధనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కల్పన, విభాగాధిపతి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

నిమ్మనపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం (6వతేదీ) నుంచి 28వరకు రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని ప్రజలు, రైతులు వారికి సంబంధించిన భూ సమస్యలులను పరిష్కరించుకోవాలని తెలిపారు. అలాగే భూ సంబంధిత సమస్యలపై పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. ప్రజల వద్ద నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధనంజేయులు వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

వివాద రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం



సమావేశం నిర్వహిస్తున్న స్పెషలాఫీసర్ భరత్‌కుమార్

కురబలకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల వేదిక ద్వారా వివాద రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లపల్లె స్పెషలాఫీసర్ భరత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం గ్రామరెవెన్యూ సదస్సుల నిర్వహణకు సంబంధించి రెవెన్యూ అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాలలో నెలకొన్న వివిధ రకాల భూ సమస్యలతో పాటుగా వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతేకాకుండా ప్రతి ఫిర్యాదుదారుడికి సంబంధించి వారి సమస్యను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని 45రోజులలో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ తపస్విని, డిటి శాంతమ్మ, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించండి



ఎంఈవోకు మెమోరాండం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ములకలచెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని కొత్తపల్లె ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్‌పై దాడి చేసి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమైక్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుడిపై దాడి చేసిన సంఘటన కలిచివేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమరనాథరెడ్డి, ఆదినారాయణ, శ్రీరాములు, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు, మహమ్మద్ రఫీ, ఉమా, సుజాత, వసంతి, అనిత పాల్గొన్నారు.

మదనపల్లెలో ఫ్యాప్టో, యూటీఎఫ్ నాయకుల నిరసన..



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):రాయచోటిలో ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడిచేసి ప్రాణాలు తీసిన సంఘటనపై మదనపల్లెలో ఫ్యాప్టో నాయకులు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాలు పలు చోట్ల గురువారం నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక జడ్పీ హైస్కూల్ ఎదుట జరిగిన ఆందోళనలో నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఉపాధ్యాయుడు ఏజాష్ అహమ్మద్ కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని, దాడిచేసిన వారి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక నీరుగట్టువారిపల్లెటని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల ఎదుట యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడి మరణంపై నిజానిజాలు వెలికి తీసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎం సుబ్బారెడ్డి, ఎస్టీయూ నాయకులు రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలకడలో:రాయచోటి కొత్తపల్లె ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎజాజ్‌అహ్మద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు వారు గురువారం ఎమ్మార్సీలో ఎంఈవో-2 రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు చెంగల్ రా యులు, శ్రీనివాసరావు, సదాశివరెడ్డి, సరస్వతమ్మ, అనిత, సుమిత్ర, రెడ్డిశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, సుబ్రమణ్యం, ఇర్ఫాన్, నూరుల్లా, ఆంజినేయులు, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

రామసముద్రంలో: ఉపాధ్యాయుడిపై దాడిచేసిన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని ఎస్టీయూ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమేరకు గురువారం రామసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, రామసముద్రం అధ్యక్షుడు అయుబ్‌ఖాన్ మాట్లాడుతూ రాయచోటిలో ఉపాధ్యాయుడు ఇజాజ్‌అహ్మద్ మృతి సంఘటన చాలా బాధాకరమన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన ఈసంఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఆర్థిక కార్యదర్శి సురేష్ నాయకులు గాయత్రి, నరేంద్ర, షాహిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు తయారీపై యువకులకు శిక్షణ



వానపాముల పెంపకం విధానాన్ని రైతులకు వివరిస్తున్న అశోక్‌కుమార్ రెడ్డి

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ సాగు విధానాల్లో భాగంగా వర్మీకంపోస్టు తయారీ, వినియోగం, ప్రయోజనాలు, ఫలితాల గురించి గ్రామీణ యువతకు వారం రోజు లపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. గురువారం జరిగిన మొదటి రోజు శిక్షణలో ఆమె మాట్లాడుతూ రసాయన రహిత ఆహార పదార్థాలకు డిమాండు పెరిగిందని దీనికి అనుగుణంగా సేంద్రీయ వ్యవసాయంలో కీలకమైన వర్మీకంపోస్టు తయారీకి ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ఏడీ అశోక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతుల్లో పచ్చిరొట్ట ఎరువులను వాడాలన్నారు. ఏవో నవీన్‌కుమార్ రెడ్డి, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సోమశేఖర్ బాబు, డాక్టర్ పీరూ సాహెబ్, డాక్టర్ మాధురి, కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నేలల దినోత్సవం

స్థానిక కేవీకేలో అంతర్జాతీయ నేలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కృత్రిమ మందులు, రసాయనాలతో నేలను కలుషితం చేయకుండా దాని స్వభావాన్ని కాపాడుకోవలసిన అవసరముందని స్పష్టం చేశారు. కేవీకే, శాస్త్రవేత్తలు, అధికారులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

చైతన్య సేవా సంస్థ వ్యవస్థాపకుడికి ఘన సన్మానం



ఆనందన్‌కు సన్మానం చేస్తున్న మదర్ థెరిసా ఫౌండేషన్ వారు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో గత 22 ఏళ్లుగా చైతన్య సేవా సంస్థను ఏర్పాటు చేసి సేవలు నిర్వహిస్తున్న ఆ సంస్థ ఫౌండర్ ఎంపీ ఆనందనన్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. కడప జిల్లా పోరుమావిళ్లలోని మదర్‌థెరిసా ఫౌండేషన్ నిర్వాహకులు మదర్‌థెరిసా సేవారత్న పురస్కారంతో దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. నేడు ప్రపంచ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ థెరిసా సేవా రత్న పురస్కారం అందివ్వడం ఆనందంగా ఉందని దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో చిత్తా విజయ్‌ప్రతాప్, చిత్తా రవిప్రకాష్, గిరిప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు డీఏ బకాయిలు చెల్లించాలి

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని పీలేరు మండల రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో గురువారం ఆయన మాట్లాడుతూ 1-1-2019 నుంచి 30-06-2024 వరకు పెన్షనర్లకు చెల్లించాల్సిన డీఏ బకాయిల గురించి కూటమి ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో డీఏ అందకనే చాలా మంది పెన్షనర్లు కన్నుమూశారని, కూటమి ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే దృష్టి సారించి పెన్షనర్లకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

● డీపీఆర్సీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఆర్సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ

కడప రూరల్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని డీపీఆర్సీ ప్రిన్సిపాల్(జడ్పీసీఈఓ) ఓబులమ్మ, వైస్ ప్రిన్సిపాల్(డీపీఓ) రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్సీ)లో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు పక్రియపై విస్తరణాధికారులు(ఈఓపీఆర్డీలు), పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు జిల్లా స్థాయి శిక్షణను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్, ఆర్‌జీఎస్ఏ నిధులతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ(ఏపీఎస్ఆర్ఐడీ అండ్ పీఆర్) ఆధ్వర్యంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై డిసెంబరు 5, 6 తేదీల్లో రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. రెండు బ్యాచ్‌ల ద్వారా ప్రతి మండలం నుంచి ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓ, ఆర్డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మండలానికి ఒకరు చొప్పున మొత్తం ఆరుగురు హాజరవాలన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తైన తరువాత డిసెంబరు 10 నుంచి 19 వరకు మండలాల్లో సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులకు, మండల లైవ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు, సెక్రటేరియట్ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. అభివృద్ధి ప్రణాళికలు సక్రమంగా తయారు, అమలు చేయాలన్నారు. లేకుంటే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధుల విషయంలో మనం వెనుక బడే ప్రమాదం ఉందన్నారు. అందు కోసం ఈ శిక్షణను జిల్లా, మండల స్థాయిలో పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ అధికారులు అబ్జర్వర్‌గా శిక్షణకు హాజరై పూర్తిగా పర్యవేక్షిస్తారన్నారు. ఈ విషయాలను శిక్షకులు దృష్టిలో పెట్టుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను విధినిర్వహణలో అమలు పరిచి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. ఈ శిక్షణలో డీపీఆర్సీ ఏఓ బండపల్లె నాగభూషణం ఆయా మండలాల విస్తరణాధికారులు(ఈఓపీఆర్డీలు), పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈలు, పీఆర్ ఏఈలు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎస్పీకి ఉధృతంగా వర్షం నీరు



బి.కోడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లోయర్ సగిలేరు ప్రాజెక్టుకు బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువ తట్టు నుంచి డ్యాంకు వెయ్యి క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతుంది. దీంతో సగిలేటికి 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇంకా డ్యాంకు వర్షం నీరు అధికంగా చేరుతోందని అప్రమత్తంగా ఉంటూ ఎప్పటి కప్పుడు డ్యాంకు చేరే నీళ్లను పరిశీలిస్తూ సగిలేటికి ఇంకా విడుదల పెంచుతామని ఆయన తెలిపారు.

ఎన్‌టీఏ నూతన కార్యవర్గం ఎంపిక



ఎన్‌టీఏ నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నోబుల్‌టీచర్స్ యూనియన్ జిల్లా నూతన అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా రామక్రిష్ణంరాజు, రామసుబ్బన్న ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా కె.రవీంద్ర, ఆర్థిక కార్యదర్శిగా ఎ.చలపతిరాజు, రాష్ట్ర కౌన్సిలరుగా కె.అబ్దుల్‌గఫార్ ఎన్నికైనట్లు ఎన్‌టీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు తెలిపారు. గురువారం ఎన్‌టీఏ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్‌టీఏ నేతలు లక్ష్మినారాయణ, మురళీమోహన్‌రాజు, కులశేఖర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి



రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తబజారు వీధి వాసి పఠాన్ దౌలత్‌బీపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. గత రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బుర్ఖా వేసుకుని వచ్చి బాధితురాలి కంట్లో కారం చల్లి కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. కేకలు వేయడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే స్థానికులు బంధువులకు సమాచారం అందించి ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనపై గురువారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు బంధువులు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రామాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో బినాతి మోహన్ (48) మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు కసిరెడ్డిగారి పల్లి పంచాయతీ కొత్తపల్లి వాసి మోహన్ గురువారం తెల్లవారుజామున గ్రామ శివారులోని తన పొలానికి నీరందించేందుకు వెళ్లాడు. మోటారు ఆన్ చేసే యత్నంలో, కిందపడి ఉన్న విద్యుత్ వైరును తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ, సిబ్బంది మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కమీషన్లు పెంచకపోతే ఆందోళన తప్పదు

● తక్షణమే గెజిట్ ప్రకారం ఇవ్వాలి

● ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్



ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్ నేతలు

కడప(క్రైం)డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాలపై ప్రభుత్వం చెల్లించే కమీషన్లు 9శాతం నుంచి గెజిట్‌లో పేర్కొన్నట్లు 20 శాతానికి పెంచకపోతే ఆందోళనకు దిగుతామని ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 14వతేదీ నుంచి మద్యం కొనుగోలు నిలుపుదల చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వైన్స్‌అండ్‌బార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వారు ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ఇస్తున్న కమీషన్లు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి 20శాతం పెంచాలని కోరారు. కార్యక్రమంలో బార్, వైన్ షాపుల యాజమాన్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవరుకు తీవ్రగాయాలు



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 108 వాహనం పైలెట్ సంగటి రమేశ్‌బాబు తీవ్రగాయాలపాలయ్యాడు. అన్నమయ్య జిల్లా గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రహ్మంగారిమఠం మండలం కంది మల్లయపల్లె రవీంద్రనగర్ వాసి రమేశ్‌బాబు తీవ్రగాయాలపాలయ్యాడు. సంఘటనా స్థలంలో ప్రజల సాయంతో దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఘాట్ రోడ్డు వెంబడి 108 వాహనాన్ని నడుపుతూ వస్తుండగా ఒక్కసారిగా బ్రేకులు ఫెయిల్ అయి ప్రమాదవశాత్తు డివైడరుకు ఢీకొన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆధునికం.. వేగవంతం...

● సాంకేతికతకు పెద్దపీట
● తగ్గుతున్న ఖర్చు
● యాంత్రీకరణతో ముందడుగు



నాడు ఎద్దులతో సేద్యం



తూర్పారబడుతున్న రైతులు



పవర్ స్ప్రేయరుతో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవన ప్రవాహంలో వేగం పెరిగింది. ఇందుకు అనుగుణంగా సాంకేతికతలో ఆధునికత సంతరించుకుంది. మారుతున్న కాలానికనుగుణంగా రైతు వినూత్న పద్దతుల ద్వారా సాగుకు నడుం బిగిస్తున్నారు. అంతేకాకుండా రైతులు సైతం సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారు. వ్య వసాయంలోనూ యాంత్రీకరణను వినియోగిస్తున్నారు. దీంతో వ్యవసాయ పద్ధతుల్లో వేగం పెరుగుతోంది. ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నందున రైతన్నకు వ్యవసాయం మరింత సులభతరమైంది. వివరాల్లో కెళితే...

రాజుపాలెం మండలంలో 13 పంచాయతీలకు దాదాపు 28వేల ఎకరాల్లో పంట సాగులో ఉంది. ఎద్దుల ద్వారా పంట పొలాలు దున్ని విత్తనం వేస్తున్న రోజుల్లో ఎకరాకు వరి పది నుంచి 12 బస్తాల శనగలు 3 నుంచి 4 క్వింటాళ్లు, జొన్నలు 10 క్వింటాళ్ల పంటను పండించే వారు. పంటల నూర్పిళ్ల కోసం నానా అవస్థలు పడేవారు. ప్రతి రైతు సొంత పొలాల్లో కల్లం ఏర్పాటు చేసుకుని ఎద్దుల బండ్ల ద్వారా కల్లాలకు తరలించి వాటిని నూర్పిళ్లు చేసి పంటను ఇంటి ముందు కర్జనాల్లో నిల్వ చేసుకునేవారు. మందు పిచికారీ సైతం బుడ్డ పంపులతో రోజుకు ఎకరా పొలానికి మందు పిచికారీ చేసుకునే రైతన్నకు 2012 నుంచి నేటి వరకు యాంత్రీకరణ ఆధునిక పద్ద తులు రావడంతో ఎద్దుల స్థానం నుంచి ట్రాక్టరు మొదలైంది. రోజుకు 2 ఎకరాలు సాగు చేసుకునే రైతుకు ట్రాక్టరు ద్వారా 10 ఎకరాల నుంచి 20 ఎకరాలు సేద్యం చేసుకునే స్థాయికి అడుగు పడింది. విత్తనం గొర్రు, పిల్లర్లు, గేజ్‌వీలర్‌తో దమ్ము చేయడం, చెత్తకట్టలు యంత్రం ద్వారా చుట్టలు చుట్టడం, పవర్ స్ప్రేయర్లతో మందు పిచికారీ చేయడం వల్ల ఎకరా నుంచి ఐదెకరాలు సాగు చేసుకునేందుకు సిద్ధమైన రైతుకు వ్యవసాయం మరింత సులభతరమైంది. ట్రాక్టరు పంపు ద్వారా మందు స్ప్రే చేస్తే రోజుకు పదెకరాల పంటకు మందు స్ప్రేచేయవచ్చు. దీంతో ఖర్చులు కూడా బాగా తగ్గాయి. తరువాత స్థానంలో డ్రోన్ ద్వారా మరింత మందు పిచికారీ చేయడం సులభతరమైంది. పంట నూర్పిళ్ల యంత్రాలు రావడంతో రోజుకు ఎకరా వరి పంట కోసి వాటిని నూర్పిళ్లు చేసుకునే రైతన్న రోజుకు పదెకరాల పంటను నూర్పిళ్లు చేస్తున్నారు. తూర్పారబట్టే బాధలేకుండా పంటను డైరెక్టుగా ఇంటికి తెచ్చుకునే సౌకర్యం ఏర్పడింది. ఇలా వ్యవసాయ యాంత్రీకరణతో రైతుకు దిగుబడి పెరిగింది. ఎకరాకు 25 బస్తాల వరి ధాన్యం నుంచి 35 బస్తాలు, 10 క్వింటాళ్ల జొన్న నుంచి 25 క్వింటాళ్లు, 3 క్వింటాళ్ల శనగ నుంచి 12 క్వింటాళ్లకు పెరగడంతో రైతులు ఆధునిక యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. ఖర్చు తగ్గడంతో రైతులు కొంత మేర కోలుకుంటున్నారు. ధాన్యాన్ని ప్రైవేటు గోదాము, ప్రభుత్వ గోదాముల్లో కూడా నిల్వ ఉంచడం, వాటిపై రుణం కూడా ఇవ్వడంతో మరింత ముందుకు సాగారు. ఏదేమైనా యాంత్రీకరణ ద్వారా రైతుకు వ్యవసాయం సులభతరమైంది.



నేడు ఆధునిక పద్ధతిలో ట్రాక్టరుతో సేద్యం చేస్తున్న దృశ్యం



ఆధునిక యంత్రం ద్వారా కోత



డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

వ్యవసాయం సులభం



50 ఏళ్లగా వ్యవసాయం చేస్తున్నాం. కాడెద్దులతో పంట దున్నడం, పంట వేసుకోవడంతో చాలా ఇబ్బందులు పడే వారం. దానికి తోడు కూలీల కొరత ఉండేది. యాంత్రీకరణతో వ్యవసాయం సులభతరమైంది. ఆధునిక యుగంలో ప్రతి పనికీ ఇంజనీరింగ్ వ్యవస్థ అభివృద్ధి చెంది కొత్త కొత్త పరికరాలు రావడంతో వ్యవసాయం సులభతరమైంది.

సుధాకర్‌రెడ్డి, తొండలదిన్నె

కూలీల కొరత తగ్గింది



వ్యవసాయ పనులు చేయాలంటే కూలీలు దొరక్క ఒకరి తర్వాత ఒకరు చేసుకునే వారు. పంట నూర్పిళ్లలో ఎంతో శ్రమపడేవారం. శనగ పంట పంటల్లో మందు పిచికారీ చేయడం, బుడ్డపంపు పవర్ స్ప్రేయర్ల ద్వారా కూలీలు ఇబ్బంది పడేవారు. ఎకరాకు 500 ఖర్చు వచ్చే తరుణంలో యాంత్రీకణ ఖర్చు తగ్గి స్తోంది.

సోము నారాయణరెడ్డి, రైతు

పైసలు లేనిదే పని జరగదు

● అర్జీలు ఇవ్వడం ప్రహసనమే... ● పడిగాపులు కాస్తున్న అర్జీదారులు



ఆర్డీఓ చాంబర్ వద్ద పడిగాపులు కాస్తున్న అర్జీదారులు

జమ్మలమడుగు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయిలో రెవెన్యూ సదస్సులకు పరిష్కారం మార్గం కావాలంటే రెవెన్యూ డివిజనల్ అధికారిని సంప్రదించాలి. అయితే ఇక్కడ ఆర్డీఓను కలవాలంటే ఆర్డీఓ చాంబర్‌లో ప్రధాన గేటు వద్ద పైసలు ఇవ్వనిది అర్జీదారులు లోనికి వెళ్లలేరనే ఆరోపణలున్నాయి. అంటే దేవుడు కరుణించాలంటే పూజారి చేయి తడవాల్సిందేనని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. కార్యాలయంలోకి అర్జీదారులను మాత్రమే పంపాలని, ఇతరులను పంపకూడదని ఆర్డీఓ సిబ్బందికి చెప్పినట్లు తెలుస్తోంది. గురువారం ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో ఆర్డీఓ సాయిశ్రీకి అర్జీదారులు వినతి పత్రాలు అందించే సమయంలో ఫొటోలు తీయకూడదని స్వయంగా ఆర్డీఓ తెలపడమే ఇందుకు నిదర్శనగా చెప్పవచ్చు. వివరాల్లోకెళితే...

జమ్మలమడుగు డివిజన్ రెవెన్యూ కార్యాలయం పరిధిలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల తదితర ప్రధాన ప్రాంతాలున్నాయి. రెవెన్యూ పరిధిలో ప్రజలకు ఉత్పన్నమయ్యే వివిధ సమస్యలకు బాధితులు అర్జీలతో వస్తారు. ఆర్డీఓ చాంబర్ ప్రధాన గేటు వద్దే సంబంధిత సిబ్బందితో మాట్లాడి లోనికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే గురువారం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన అర్జీదారులను మాత్రమే పంపాలని, ఇతరులను పంపకూడదని ఆర్డీఓనే స్వయంగా సిబ్బందికి చెప్పినట్లు తెలుస్తోంది. అయితే అర్జీదారులు అందజేసిన అర్జీలు బుట్టదాఖలు అవుతున్నాయని బహిరంగ ఆరోపణలున్నాయి. రాజకీయ నాయకులు చెప్పిన వాటికే, అది కూడా పైసలు లేనిది పని జరగడంలేదని అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా జమ్మలమడుగు మండలం గొరిగెనూరు నుంచి కె.నాగలక్ష్మి, భర్త చెన్నప్పతో కలిసి ఆర్డీఓ కార్యాలయం వద్దకు అర్జీ తీసుకుని వచ్చారు. వారిని లోనికి పంపలేదని చేస్తున్నారని వాపోయారు. గతంలో కూడా అర్జీలు ఇచ్చామని, 1.23 ఎకరాల పొలం సమస్య ఉందని, అధికారులకు చెప్పినా ఏ ఒక్కరూ ఇంతవరకూ రాలేదని, పని జరగకపోవడంతో మళ్లీ అర్జీ తీసుకువచ్చామని బాధిత హరిజన మహిళ మొరపెట్టుకుంది. ఆర్డీఓ కార్యాలయంలో కాకుండా రెవెన్యూ కార్యాలయంలో సైతం కిందిస్థాయి నుంచి నిర్లక్ష్యం చేస్తున్నారని, పైసలు లేనిది ఎక్కడా పని జరగడంలేదని బాధిత మహిళ వాపోయింది. ఎర్రగుంట్ల వాసి గౌతమి రేషన్ డీలర్ షాపు నిర్వహిస్తోంది. అయితే రెవెన్యూ అధికారులు బెదిరిస్తున్నారని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆర్డీఓ సాయిశ్రీకి సమస్యల గోడు చెప్పేందుకు వచ్చామని, ఇక్కడా రాజకీయం, కాసులు రాజ్యమేలుతోందని ఎంత సేపటికీ ఆర్డీఓ వద్దకు పంపరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వి.శ్రీనివాసులరెడ్డి అర్జీలు అనేకసార్లు ఇచ్చినట్లు, ఆరు నెలల నుంచీ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారం కోసం కాళ్లకు చెప్పులరిగేలా తిరుగుతున్నా, ముగ్గురు ఆర్డీఓలు మారినా ఫైలు మాత్రం కదలడంలేదని వాపోయాడు. డబ్బు ఇవ్వాలని అక్కడున్న సిబ్బంది అడుగుతున్నట్లు ఆయన ఆరోపించారు. డివిజన్ పరిధిలో దాదాపు 300 రేషన్ డీలర్ల యజమానుల నుంచి అందినకాడికి ఒక్కొక్కరితో నాలుగు నుంచి రూ.5 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. జమ్మలమడుగు, కొండాపురం, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి సుమారు 30దాకా అర్జీలు వచ్చినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రెవెన్యూ కార్యాలయాల్లో జిల్లా అధికారులు విచారణలు చేయాలని, ఆర్డీఓ కార్యాలయంలో కొన్నేళ్లగా కొందరు బదిలీ కాకుండా ఇక్కడే నన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పలు సమస్యలపై అర్జీదారులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులు చక్కటి అవకాశం : కలెక్టర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ, వ్యక్తిగత భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కటి అవకాశమని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల కార్యాచరణపై జేసీ అదితిసింగ్‌తో కలిసి కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఈనెల 6వతేదీ నుంచి వచ్చేనెల 8 వరకు నిర్వహిస్తారన్నారు. నిర్ణయించిన మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ బృందంలో రెవెన్యూ అధికారులు, దేవదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీశాఖ, పోలీసు, బ్యాంకు అధికారులు, వ్యవసాయ ప్రతినిధులు ఈ సదస్సుల్లో హాజరై గ్రామానికి సంబంధించిన అన్ని రకాల రెవెన్యూ, వ్యక్తి గత సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు, పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు కార్మిక సంఘాలు, అధికారులు పాల్గొన్నారు.

వర్షం ధాటికి నేలకూలిన ఇల్లు

ఒంటిమిట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దర్జిపల్లెలో వర్షం ధాటికి రెండు పాడుబడిన ఇళ్ల పైకప్పు కూలి నేలకూలాయి. వర్షం ధాటికి ఇళ్లు నేల కూలుతాయని ముందస్తు సమాచారంతో పక్కన ఇంటికి పోయారని, ఇంట్లో సామాన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు ,ధ్వంసం అయ్యాయని గ్రామస్థులు తెలిపారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శివశంకర్ నాయుడు మృతదేహం

కలకడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ - కలకడ మార్గంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శివశంకర్ నాయుడు(51) మృతి చెందాడు. దేవశంపల్లె పంచాయతీ బొజ్జగుంట పల్లె వాసి శివశంకర్ నాయుడు సొంత పనినిమిత్తం ద్విచక్రవాహనంలో కలకడకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా ప్రమాదం సంభవించింది. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరుపై విచారించారు.

విప్లవాత్మక ఆవిష్కరణకు భారత్, యూకే పేటెంట్

పేటెంట్ గ్రహీత ప్రొఫెసరు రఘుబాబుకు వైస్‌చాన్సలర్ ప్రశంసలు



ప్రొఫెసర్ రఘుబాబును అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో శాస్త్రసాంకేతిక రంగంలో అద్భుతాలు కొనసాగుతున్న వేళ వైవీయూ జియాలజీ విభాగం, టీఎస్ఐఆర్ నేషనల్ జియోఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త పరిశోధనల ద్వారా రెండు ప్రతిష్టాత్మక పేటెంట్లను సాధించడం గర్వకారణంగా నిలిచింది. 'జియో ఇంటిగ్రేటెడ్ సాయిల్ ప్రాపర్టీ డివైజ్ విత్ ఎంటాన్ జీపీఎస్ అక్యురసీ' ఆవిష్కరణకు భారత ప్రభుత్వ పేటెంట్ లభించగా, 'జియో పేషియల్ మల్టీ సెన్సార్ సాయిల్ టెస్టింగ్ ప్రొబ్' ఆవిష్కరణకు యూకే డిజైన్ పేటెంట్ లభించింది. ఈ రెండు ఆవిష్కరణలు భూసార పరిశోధన రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాయి. ఈ పరికరాలు భూమి క్షారగుణాలను ఖచ్చితంగా గుర్తించి భౌగోళిక సమాచారాన్ని సమర్ధవంతంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. జీపీఎస్ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి భూసారం విశ్లేషణను అధునాతనంగా మార్చే ఈ పరికరాలు భూసార పునరుద్దరణ, వ్యవసాయం, భూమి వినియోగ సామర్థ్యాలను మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తాయి. ఈ విజయాల్లో పరిశోధకులు అనూష బోయ నక్కల, డాక్టర్ ప్రదీప్‌కుమార్ బాలుపల్లి, డాక్టర్ చక్రం గుగ్గులోతు, వైవీయూ ప్రొఫెసరు రఘుబాబు కొట్టాల, పద్మశ్రీ, దీపిక కృషి ముఖ్యమైనది. వారు ఆవిష్కరించిన ఈరెండు పరికరాలు వ్యవసాయేతర రంగాలకు కూడా విస్తృత ప్రయోజనాలు అందిస్తున్నాయి. వైస్‌ఛాన్సలరు క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి, రిజిస్ట్రారు పద్మ భూగర్భ శాస్త్రవిభాగం ప్రొఫెసరు సునీత, ప్రొఫెసరు జయారాజ్, శ్రీనివాస్‌గౌడ్, టీఆర్‌సెల్ సంచాకులు డాక్టర్ సవిత, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

సిద్దవటం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థలం వివాదం విషయంలో విచారణకు వెళ్లిన లింగంపల్లి వీఆర్ఏ కిశోర్‌పై కాజిపల్లెకు చెందిన నిమ్మకాయల ఓబులరెడ్డి, జయరాం రెడ్డి దాడి చేసిన విషయం తెలిసిందే. గురువారం ఈ కేసు విషయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు గ్రామంలో విచారణ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

వైవీయూ విద్యార్థికి మరో కాంస్యం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ దక్షిణ అంతర్ విశ్వ విద్యాలయ పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వైవీయూకు మరో కాంస్య పతకం లభించింది. దీంతో వైవీయూ మొత్తంమూడు పతకాలు సొంతం చేసుకుంది. కమలాపురం సీ ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం కళాశాల విద్యార్థి రాజశేఖర్ 109 కిలోల విభాగంలో నాక్‌లో 124 కిలోలు, క్లీన్‌జర్క్ విభాగంలో 171 కిలోలు మొత్తం 295 కిలోలు బరువు ఎత్తి మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. రాజశేఖర్‌ను వైస్‌చాన్సలర్ స్పోర్ట్స్ బోర్డు చైర్మన్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి, వ్యాయామవిద్య సెక్రటరీ కె.రామసుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

రహదారికి మోక్షమెప్పుడో..?

- అధ్వానంగా తంబళ్లపల్లె-కోసువారిపల్లె రోడ్డు
- అవస్థలు పడుతున్న 15 గ్రామాల ప్రజలు
- అధికారులు స్పందించాలంటున్న జనం
- టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపడుతామంటున్న పీఏయూ ఏఏఈ


గుంతలమయంగా మారిన తంబళ్లపల్లె-కోసువారిపల్లెకు వెళ్లే రోడ్డు

తంబళ్లపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రం నుంచి కోసువారిపల్లె రోడ్డుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి గుంతలమయంగా మారడంతో 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తంబళ్లపల్లె నుంచి కోసువారిపల్లెకు వెళ్లే ప్రధాన రోడ్డు సుమారు 12 కిలో మీటర్ల మేర అధ్వానంగా మారింది. రోడ్డు ఆద్యంతం పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తే ఒళ్లు హూనమవ్వడమే కాదు..వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఎంత జాగ్రత్తగా బండి నడిపినా గోతుల్లో పడి ప్రమాదాలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తంబళ్లపల్లె మండల కేంద్రం నుంచి దాదంవడ్డిపల్లె, గుండూరివారిపల్లె, రామాపురం, జొన్నచేనుపల్లె, దిగువముత్రవారిపల్లె, పాపనచెరువుపల్లె, ముత్రవారిపల్లె కోసువారిపల్లె తదితర సుమారు 15 గ్రామాలకు పైగా వెళ్లడానికి ఇదే ప్రధాన రోడ్డు. ఈ రోడ్డు మార్గాన పల్లెలు ఎక్కువగా ఉండటంతో నిత్యం వందల మంది ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాల్లో తంబళ్లపల్లెకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి వెళుతుంటారు. అంతేకాకుండా శనివారం, ఇతర ప్రత్యేకమైన పండుగ రోజుల్లో కోసువారిపల్లెలో కొలువైన వేంకటరమణ స్వామిని దర్శించుకోవడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు వందల సంఖ్య లో ఈ రోడ్డు మార్గాన వచ్చి వెళ్తుంటారు. అయి తే ఈ రోడ్డుకంకర తేలిపోయి గుంతలమయమ వడంతో ప్రయాణం సాగించాలంటే అవస్థలు పడుతున్నట్లు వాహన చోదకులు వాపోతున్నా రు. రాత్రి వేళల్లో అయితే గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఈ రోడ్డు తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా తయా రైంది. దీంతో కోసువారిపల్లెకు వెళ్లే వారు కొంచెం దూరాభారమైన మదనపల్లె రోడ్డుకు ఉన్న మూలపల్లె, పంచాలమర్రి మీదుగా ఉన్న లింకు రోడ్డు మీదుగా దేవరబురుజుకు చేరుకుని అక్కడి నుంచి కోసువారిపల్లె ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రోడ్లకు మహర్దశ పట్టింది. తంబళ్లపల్లె మండల కేంద్రం నుంచి ముదివేడు క్రాస్ వరకు గోతుల మయంగా ఉన్న రోడ్డుకు చేపట్టిన మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. గతంలో చాలా అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తంబళ్లపల్లె నుంచి కోసువారిపల్లెకు వెళ్లే రోడ్డుకు కూడా మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు టెండర్ ప్రక్రియలో ఉంది

తంబళ్లపల్లె నుంచి కోసువారిపల్లెకు వెళ్లే రోడ్డు (ముద్దలదొడ్డి రోడ్డు) వరకు 8కిలోమీటర్ల మేర రూ.7.65 కోట్ల నిధులతో మంజూరైంది. అయితే రోడ్డు టెండర్ ప్రక్రియలో ఉంది. టెండర్లు పూర్తి అయిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

-నిరంజన్‌కుమార్‌రెడ్డి, పీఏయూ ఏఏఈ, తంబళ్లపల్లె

ఎంఎస్‌ఎంఈ సర్వేపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీవో అమరనాథరెడ్డి

మదనపల్లె టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల స్థాపనలో భాగంగా నిర్వహించే సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది అవగాహన పెంచుకోవాలని డీఎల్‌డీవో అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ పథకం కింద చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఔత్సాహికులను గుర్తించాలన్నారు. అనంతరం వారు ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు ఎంత ఆర్థిక సహాయం అవసరమో గుర్తించి పూర్తి వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ విషయాలన్నింటిపై ఈనెలాఖరులోగా సర్వే చేసి నివేదికలను పంపాలన్నారు. ఎంపీడీవో తాజ్ మస్రూర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి శంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట సీఐగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌బాబు



బి.కొత్తకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బి.కొత్త కోట పట్టణ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన జీవన్ గంగాధర్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జిల్లా పులివెందుల సీఐగా పనిచేస్తూ బదిలీపై కొత్తకోటకు వచ్చారు. ఇంతకాలం ఇక్కడ సీఐగా పనిచేసిన కే.రాజారెడ్డి అన్నమయ్య జిల్లా ఎస్‌బికి బదిలీ అయ్యారు. కాగా పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు నూతన సీఐ గంగాధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు ఇచ్చి బి.కొత్తకోటకు సాదర స్వాగతం పలికారు.

పీటీఎం ఎస్‌ఐగా రవికుమార్



పెద్దతిప్పసముద్రం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) :పెద్దతిప్పసముద్రం నూతన ఎస్‌ఐగా రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న నరసింహుడు బదిలీపై ములకలచెరువుకు బదిలీ కాగా మదనపల్లెలో విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ పెద్దతిప్పసముద్రం మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపి మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఎం వెంకటరమణరెడ్డి

మదనపల్లె అర్బన్, డిసెంబరు5: ఉద్యోగ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులను వన్ డిపో డీఎం వెంకటరమణారెడ్డి అభినందించారు. స్థానిక వన్ డిపో గ్యారేజ్‌లో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించి ఆదర్శ ఉద్యోగులకు డీఎం నగదు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇందులో అధిక ఆదాయం సాధించిన ఉద్యోగులు శివశంకర్, వేణుగోపాల్, టీవీ రమణ, ఎక్కువ ఈపీకే తెచ్చిన కె. సుధాకర్, బికృష్ణ, సి. సుధాకర్, లీలావతమ్మ, మిగిలిన విభాగాల్లో పిఆర్‌బేగ్, డికృష్ణప్ప, ఎస్‌ఎస్ వాసులు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పౌష్టికాహారం అందచేస్తున్న ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి

తంబళ్లపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీవో తంబళ్లపల్లె మెయిన్ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరు పట్టీ, రికార్డులతో పాటు కేంద్రంలోని గుడ్లు, పాలప్యాకెట్లు, చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడతూ..చిన్నారులకు మెనూ మేరకు భోజనాలు అందించాలని సూచించారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు సకాలంలో టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్), పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం చిన్నారుల తల్లులకు టీహెచ్‌ఆర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్‌నాయక్, అంగన్వాడీ వర్కర్లు ఉమాదేవి, సరస్వతి, కళావతి, హెల్పర్లు కవిత, సరస్వతీ, పద్మావతమ్మ ఉన్నారు.

ఆలయ రాజగోపురం ప్రారంభానికి సర్వం సిద్ధం


ప్రారంభానికి సిద్ధమైన రాజగోపరం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మనపల్లె రోడ్డులో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణంస్వామి ఆలయ రాజగోపురం ప్రారంభానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. శనివారం రాజగోపురం ప్రారంభం సందర్భంగా కుంబాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణం, రాచపల్లె అనురాధలు తెలిపారు. ఆలయంలో మూడు రోజులుపాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం ఆలయంలో గంగపూజ, గోపూజ, మహాగణపతి పూజ, రక్షాబంధన, కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం రాజగోపుం ప్రారంభంతోపాటు కలశారాధన, శాంతి హోమాలు, శిఖర కళశాల ప్రారంభోత్సవం అనంతరం కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకం, వల్లీదేవసేన సమేత సుబ్రమ్మణ్యంస్వామి కల్యాణం నిర్వహించి అనంతరం పుష్పయాగం చేస్తామన్నారు. ఆలయంలో భక్తులకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్నదాన వితరణ ఉంటుందని చెప్పారు.

వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష


బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్షిస్తున్న డిప్యూటీ ఈవో వరలక్ష్మీ

తంబళ్లపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై డిప్యూటీ ఈవో వరలక్ష్మీ సమీక్ష నిర్వహించారు. గురువారం ఈవో ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై టీటీడీ అధికారులు, గ్రామ ప్రజలు, భక్తులతో సమీక్ష నిర్వహించారు. తదనంతరం ఆలయంలో చేపడుతున్న గాలి గోపురం పనులను పరిశీలించారు. జనవరిలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో గోపురం నిర్మాణ పనులు వేగవంతం చేసి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అవినీతి మరకలు అంటిస్తే సహించం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు అవినీతి మరకలు అంటిస్తే సహించబోమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం టీడీపీ బీసీ నాయకులు రామిశెట్టికృష్ణ, మదనపల్లె పట్టణ ఉపాధ్యక్షుడు యర్లబల్లి వెంకటరమణారెడ్డి, ఒకటో వార్డు ఇన్‌చార్జి మల్లికార్జున నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధిష్టానికి మండల తహసీల్దార్ ఖాజాబీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అదేవిధంగా పట్టణంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు విరివిగా చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్రసభ్యులు ప్రభాకర్, తమ్మిశెట్టి శ్రీరాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో చేతివృత్తులకు చేయూత


పీఎం విశ్వకర్మ యోజన పథకం ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంతో చేతివృత్తుల కార్మికులకు చేయూతగా నిలుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికులకు, ధోబీ తోపాటు 18 రకాల చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ఏడు రోజులపాటు శిక్షణతోపాటురూ. 15 వేలు విలువ చేసే పరికరాలను, శిక్షణ సమయంలో ప్రతి రోజురూ. 500 నగదును, లక్ష రూపాయాల వరకు లోను మంజూరు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు కమలమరికృష్ణ, నాదేళ్లశివ, మదనపల్లె భవన నిర్మాన కార్మిక సంఘం అధ్యక్షుడు జంగాల శ్రీని వాసులు, ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్‌స్వాతి, చక్రపాణి, కెవి ఫౌండేషన్ చైర్మన్ టీవీరమణ పాల్గొన్నారు.

కొటాల రెవెన్యూ సదస్సు మార్పు

తంబళ్లపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో ఈ నెల 7వ తేదీ నిర్వహించాల్సిన కొటాల గ్రామ రెవెన్యూ సదస్సును 9వ తేదీకి మార్పు చేసినట్లు తహసీల్దారు హరికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీన మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్(పీటీయం)ను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొటాల గ్రామ రెవెన్యూ సదస్సును మార్చినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

చెరువు కట్ట విస్తరణ పనులు ప్రారంభం


చెరువు కట్ట విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

పెద్దమండ్యం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి చెరువు కట్ట పనులు ప్రారంభమయ్యాయి. గురువారం ఇరిగేషన్ ఈఈ సురేష్ బాబు, ఏఈ శ్రీనివాసులురెడ్డిలు పనులను ప్రారంబించి పరిశీలించారు. 'కదల ని చెరువు కట్ట విస్తరణ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో నవంబరు 30వ తేదీన వెలువడి కథనానికి మదన పల్లి డివిజన్ ఇరిగేషన్ యంత్రాంగం స్పందించింది. ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు, ఏఈ శ్రీనివాసులురెడ్డి పర్యటించి గుడిసెవారిపల్లి చెరువు కట్ట పనులను పరిశీలించి కట్ట విస్తరణ పనులు వేగవంతం చేయా లని సిబ్బందిని ఆదేశించారు.. ఈసందర్భంగా ఇరిగేషన్ అధికారులతోపాటు ఎంపీడీవో శ్రీధర్‌రావు చెరువు కట్ట విస్తరణ పనులను ప్రారంభించి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు గుడిసెవారిపల్లి చెరువు కట్ట విస్తరణ అభివృద్ధి సకాలంలో పూర్తి చేస్తామని వెల్లడించారు. దీంతో గుడిసెవారిపల్లి, పి.తురకపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు అండగా 'భవిత' కేంద్రాలు

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొల్పిన 'భవిత' కేంద్రాలు దివ్యాంగులైన విద్యార్థులకు అనే క విధాలుగా అండగా నిలుస్తు న్నాయని ఎంఈవో కరీముల్లా కితాబిచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భం గా కలికిరి ప్రధాన ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం ఉపాధ్యాయులను కూడా నియమించడం జరిగిందన్నారు. పాఠశాలకు హాజరు కాలేని దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రతి శనివారం హోమ్ బేస్డ్ విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురాద్‌షా వల్లీ, ప్రత్యేక ఉపాధ్యాయులు ధనలక్ష్మి, రెడ్డిప్రసాద్, సీఆర్పీలు సురేష్, రియాజుద్దీన్‌లు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలోని భవిత పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారులు నారాయణ, గౌస్‌పీర్‌లు అధ్యక్షతన మండలం లోని దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర, ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: స్థానిక భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి ఎంఈవోలు వెంకటరమణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉషారాణి, ఐఈడీఎస్ కుసుమ, ఐఈఆర్‌టీలు నీరజ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వైకల్యం మనిషికే కానీ మనసుకి కాదని వాల్మీకిపురం ఎంఈవో వెంకటలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక కోనేటివీధిలోని మెయిన్ పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను విజయవంతం చేయండి

మదనపల్లె టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్‌నాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీహైస్కూల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21, 22వ తేదీల్లో అన్నమయ్య జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను మదనపల్లెలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యారంగం సమస్యలపై ఈ మహాసభల్లో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్‌ఐ నాయకులు సాయిచరణ్, యూటీఎఫ్ నాయకులు రవీంద్ర, సురేంద్ర, చలపతి, నాగరాజు, వరప్రసాద్, రామచంద్ర, ముబారక్ పాల్గొన్నారు.

గ్రాట్స్‌టెక్నాలజీతో మిట్స్ ఒప్పందం



కురబలకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం బెంగళూరుకు చెందిన గ్రాట్స్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ యువరాజ్, ఆ కంపెనీ వ్యవస్థాపకుడు శ్రీనివాస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడంతో పాటుగా అవగాహన కార్యక్రమాలలో సహాయసహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఐటీ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కొవాలో తెలియజేడంతో కోడింగ్, సామర్థ్యాలను మెరుగుపరచుకోవడం తదితర వాటికి సంబంధించి సలహాలు, సూచనలు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కళాశాల విద్యార్థులు ఉమ్మడి మార్గదర్శకత్వంలో ప్రాజెక్టులు, పరిశోధనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కల్పన, విభాగాధిపతి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి


రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

నిమ్మనపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం (6వతేదీ) నుంచి 28వరకు రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని ప్రజలు, రైతులు వారికి సంబంధించిన భూ సమస్యలులను పరిష్కరించుకోవాలని తెలిపారు. అలాగే భూ సంబంధిత సమస్యలపై పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. ప్రజల వద్ద నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధనంజేయులు వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

వివాద రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం


సమావేశం నిర్వహిస్తున్న స్పెషలాఫీసర్ భరత్‌కుమార్

కురబలకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల వేదిక ద్వారా వివాద రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లపల్లె స్పెషలాఫీసర్ భరత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం గ్రామరెవెన్యూ సదస్సుల నిర్వహణకు సంబంధించి రెవెన్యూ అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాలలో నెలకొన్న వివిధ రకాల భూ సమస్యలతో పాటుగా వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతేకాకుండా ప్రతి ఫిర్యాదుదారుడికి సంబంధించి వారి సమస్యను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని 45రోజులలో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్ధార్ తపస్విని, డిటి శాంతమ్మ, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించండి


ఎంఈవోకు మెమోరాండం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ములకలచెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని కొత్తపల్లె ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్‌పై దాడి చేసి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమైక్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుడిపై దాడి చేసిన సంఘటన కలిచివేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమరనాథరెడ్డి, ఆదినారాయణ, శ్రీరాములు, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు, మహమ్మద్ రఫీ, ఉమా, సుజాత, వసంతి, అనిత పాల్గొన్నారు.

మదనపల్లెలో ఫ్యాప్టో, యూటీఎఫ్ నాయకుల నిరసన..


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):రాయచోటిలో ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడిచేసి ప్రాణాలు తీసిన సంఘటనపై మదనపల్లెలో ఫ్యాప్టో నాయకులు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాలు పలు చోట్ల గురువారం నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక జడ్పీ హైస్కూల్ ఎదుట జరిగిన ఆందోళనలో నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఉపాధ్యాయుడు ఏజాష్ అహమ్మద్ కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని, దాడిచేసిన వారి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక నీరుగట్టువారిపల్లెటని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల ఎదుట యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడి మరణంపై నిజానిజాలు వెలికి తీసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎస్టీయూ నాయకులు రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలకడలో:రాయచోటి కొత్తపల్లె ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎజాజ్‌అహ్మాద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు వారు గురువారం ఎమ్మార్సీలో ఎంఈవో-2 రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు చెంగల్ రా యులు, శ్రీనివాసరావు, సదాశివరెడ్డి, సరస్వతమ్మ, అనిత, సుమిత్ర, రెడ్డిశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, సుబ్రమణ్యం, ఇర్ఫాన్, నూరుల్లా, ఆంజినేయులు, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

రామసముద్రంలో: ఉపాధ్యాయుడిపై దాడిచేసిన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని ఎస్టీయూ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమేరకు గురువారం రామసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, రామసముద్రం అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్ మాట్లాడుతూ రాయచోటిలో ఉపాధ్యాయుడు ఇజాజ్‌అహ్మాద్ మృతి సంఘటన చాలా బాధాకరమన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన ఈసంఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఆర్థిక కార్యదర్శి సురేష్ నాయకులు గాయత్రి, నరేంద్ర, షాహిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు తయారీపై యువకులకు శిక్షణ


వానపాముల పెంపకం విధానాన్ని రైతులకు వివరిస్తున్న అశోక్‌కుమార్ రెడ్డి

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ సాగు విధానాల్లో భాగంగా వర్మికంపోస్టు తయారీ, వినియోగం, ప్రయోజనాలు, ఫలితాల గురించి గ్రామీణ యువతకు వారం రోజు లపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. గురువారం జరిగిన మొదటి రోజు శిక్షణలో ఆమె మాట్లాడుతూ రసాయన రహిత ఆహార పదార్థాలకు డిమాండు పెరిగిందని దీనికి అనుగుణంగా సేంద్రీయ వ్యవసాయంలో కీలకమైన వర్మీకంపోస్టు తయారీకి ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ఏడీ అశోక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతుల్లో పచ్చిరొట్ట ఎరువులను వాడాలన్నారు. ఏవో నవీన్‌కుమార్ రెడ్డి, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సోమశేఖర్ బాబు, డాక్టర్ పీరూ సాహెబ్, డాక్టర్ మాధురి, కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నేలల దినోత్సవం

స్థానిక కేవీకేలో అంతర్జాతీయ నేలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కృత్రిమ మందులు, రసాయనాలతో నేలను కలుషితం చేయకుండా దాని స్వభావాన్ని కాపాడుకోవలసిన అవసరముందని స్పష్టం చేశారు. కేవీకే, శాస్త్రవేత్తలు, అధికారులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

చైతన్య సేవా సంస్థ వ్యవస్థాపకుడికి ఘన సన్మానం


ఆనందన్‌కు సన్మానం చేస్తున్న మదర్ థెరిసా ఫౌండేషన్ వారు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో గత 22 ఏళ్లగా చైతన్య సేవా సంస్థను ఏర్పాటు చేసి సేవలు నిర్వహిస్తున్న ఆ సంస్థ ఫౌండర్ ఎంపీ ఆనందనన్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. కడప జిల్లా పోరుమామిళ్లలోని మదర్‌థెరిసా ఫౌండేషన్ నిర్వహకులు మదర్‌థెరిసా సేవారత్న పురష్కారంతో దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. నేడు ప్రపంచ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ థెరిసా సేవా రత్న పురస్కారం అందివ్వడం ఆనందంగా ఉందని దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో చిత్తా విజయ్‌ప్రతాప్, చిత్తా రవిప్రకాష్, గిరిప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు డీఏ బకాయిలు చెల్లించాలి

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని పీలేరు మండల రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో గురువారం ఆయన మాట్లాడుతూ 1-1-2019 నుంచి 30-06-2024 వరకు పెన్షనర్లకు చెల్లించాల్సిన డీఏ బకాయిల గురించి కూటమి ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో డీఏ అందకనే చాలా మంది పెన్షనర్లు కన్నుమూశారని, కూటమి ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే దృష్టి సారించి పెన్షనర్లకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.